ప్రజాహితమే మా అభిమతం
# సాక్ష్యం
తెలుగు దినపత్రిక
Telangana
హైదరాబాద్
సోమవారం, 03 ఫిబ్రవరి 2025
Published from Hyderabad, Karim nagar & Nalgonda, Vijayawada.
సంపుటి: 16 | సంచిక: 33
పేజీలు: 08 | వెల: రూ.2:00
WWW.SAKSHYAM.COM



## చిక్కుల్లో రామ్‌దేవ్ బాబా!

**నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ**

**కేరళ హైకోర్టు కీలక నిర్ణయం**

ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలంటూ ఆగ్రహం యోగా గురువు, పతంజలి ఆయుర్వేద సంస్థ వ్యవస్థాపకుడు రామ్‌దేవ్ బాబా చిక్కుల్లో పడ్డారు. రామ్ దేవ్ బాబా, ఆ సంస్థ ఎండీ ఆచార్య బాలకృష్ణకు కేరళ హైకోర్టు నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ మిగతా 2 లో..



## ఏప్రిల్ 1 నుంచి జేఈఈ మెయిన్ -2 పరీక్షలు

దేశవ్యాప్తంగా గల ఐఐటీలు, ఎన్ఐటీల్లో బీటెక్/ బీఈ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ మెయిన్ -2 పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఈ పరీక్షలను ఏప్రిల్ 1 నుంచి 8 వరకు నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) ప్రకటించింది. ఈ పరీక్షకు హాజరయ్యేవారు ఈ నెల 25 రాత్రి 9 గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్టీఏ వెల్లడించింది. ఇక రాత్రి 11.50 గంటల వరకు ఫీజును స్వీకరిస్తామని సంస్థ ప్రకటించింది. జేఈఈ మెయిన్ -1 పరీక్షలను జనవరిలో నిర్వహించిన మిగతా 2 లో..

## త్వరలోనే పంచాయతీ ఎన్నికలు

**ఫిబ్రవరి 15లోపే షెడ్యూల్ విడుదలయ్యే ఛాన్స్**

**మంత్రి పొంగులేటి కీలక ప్రకటన**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ప్రకటన చేశారు. ఫిబ్రవరి 15 లోపే పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించిన ఆయన వైరా కార్యకర్తల సమావేశంలో 'ఎన్నికలు వస్తున్నాయ్.. జాగ్రత్త' అంటూ కార్యకర్తలకు సూచించారు. కాగా.. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి సమగ్ర కుటుంబ సర్వేపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఎన్నికల అంశం కూడా చర్చకు వచ్చింది. ఎన్నికలకు మిగతా 3 లో..



## అమెరికా దిగుమతులపై 25 శాతం సుంకం

- కెనెడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో నిర్ణయం
- వాషింగ్టన్ చర్యలకు కెనెడా ప్రతిస్పందన
- కెనెడా బాటలోనే మెక్సికో, చైనా అడుగులు



కెనెడా, మెక్సికో దిగుమతులపై 25 శాతం సుంకం విధించే ఆర్డర్లపై ట్రంప్ సంతకం చేసినట్లు ప్రకటించాగానే కెనెడా, మెక్సికో దేశాలు అదే విధంగా స్పందించాయి. ట్రంప్ నిర్ణయంపై ప్రతీకార చర్యలు తీసుకునేందుకు కెనెడా, మెక్సికో దేశాల మిగతా 3 లో..

## కాంగోలో సైన్యానికి, రెబల్స్‌కు మధ్య భీకర యుద్ధం

- కాంగోలో దశాబ్దాలుగా ఘర్షణలు
- తిరుగుబాటుదారుల వశమైన అతిపెద్ద నగరం గోమా
- పోరులో 700 మందికిపైగా మృతి
- ఘర్షణల్లో 2,880 మందికి తీవ్ర గాయాలు

దశాబ్దాలుగా కొనసాగుతున్న ఘర్షణలు కాంగోలో మరోమారు భీకర స్థాయికి చేరుకున్నాయి. కాంగో సైన్యం, రువాండా మద్దతు కలిగిన రెబల్స్ మధ్య వారం రోజులుగా జరుగుతున్న పోరులో 700 మందికిపైగా మృతి చెందారు. వందలాదిమంది గాయపడ్డారు. రెబల్స్ శక్తి ముందు సైన్యం సామర్థ్యం సరిపోవడం లేదు. దీంతో తూర్పు కాంగోలోని అతిపెద్ద నగరమైన గోమాను స్వాధీనం చేసుకున్న మిగతా 3 లో..



# రాష్ట్రానికి మొండిచేయి




## రాష్ట్రానికి అదనపు నిధులపై గంపెడాశలు

**కేంద్ర బడ్జెట్ ఆశలపై నీళ్లు**

- పలు ప్రాజెక్టులకు కేటాయించని నిధులు
- పరోక్ష ప్రయోజనాలపైనే ఆధారం
- బడ్జెట్లో తెలంగాణ రైల్వేకు తీవ్ర అన్యాయం
- అంచనాలకు దరిదాపుల్లోనూ రాని కేటాయింపులు

ప్రాంతీయ రింగురోడ్డు, పది కొత్త గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్ల అభివృద్ధి, మెట్రో రైలు రెండో దశ, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్, గోదావరి, మూసీ నదుల అనుసంధానం, హైదరాబాద్ అభివృద్ధి, నగరంలో సీవరేజీ మాస్టర్ ప్లాన్‌తో పాటు వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజి ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలని కోరింది. బందర్ పోర్టు నుంచి హైదరాబాద్ డ్రై పోర్టు వరకు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ రోడ్డును మంజూరు చేయాలని, హైదరాబాద్‌లో సెమీకండక్టర్ మిషన్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. కాజీపేట రైల్ కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, కొత్త రైల్వే లైన్లు, జాతీయ రహదారులు, ఇతరత్రాలకు నిధులను కేటాయించాలని కోరింది. తెలంగాణకు రావాల్సిన పన్నుల వాటా, కేంద్ర ప్రత్యేక పథకాల గ్రాంట్ల విషయంలో రాష్ట్రానికి ప్రతీసారి అన్యాయమే జరుగుతోందని ఈ సారైనా న్యాయం చేస్తారని ఆశలు పెట్టుకొంది. కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకున్న ఆశలు నీరుగారాయి. రాష్ట్రానికి చట్టబద్ధంగా రావాల్సిన వాటా, నిధులు తప్ప ఎలాంటి ఇతర కేటాయింపులు లేవు. విభజన చట్టం హామీలు సహా మిగతా 2 లో..



కేంద్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఆశించిన పథకాలు, కేటాయింపులు ఏమీ దక్కలేదు. బిహార్, అస్సాం, అండమాన్, ఈశాన్య రాష్ట్రాలు, గుజరాత్‌లకు మినహా ఏ రాష్ట్రానికి నేరుగా ఎలాంటి కేటాయింపులు, ప్రాజెక్టులు ప్రకటించలేదు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రాజక్టులకు ఆయా శాఖల ద్వారా కేటాయింపులు చేశారు. ఐఐటి, ట్రైబల్ యూనివర్సిటీ వంటి ఉన్నత విద్యా సంస్థలు, ఎయిమ్స్ వంటి వాటికి గతంలో నేరుగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిపినా ఈ ఏడాది ఆయా శాఖల ద్వారానే అవసరమైన నిధులు అందించనున్నారు. విభజన చట్టంలోని పెండింగ్ హామీలతో పాటు కొత్త ప్రాజెక్టులకు తగిన నిధులు ఇస్తారని ఆశలు పెట్టుకొంది. కొత్త ప్రాజెక్టుల కోసం దాదాపు రూ.1.63 లక్షల కోట్లు అవసరమని పలు సందర్భాల్లో కేంద్రానికి నివేదికలు, వినతిపత్రాలు సమర్పించింది.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

- రాష్ట్రం పట్ల వివక్ష చూపిస్తోంది
- సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తోంది
- కేంద్రం వివక్షను ప్రజాక్షేత్రంలోనే ఎండగట్టాలి
- కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు మహేశ్ కుమార్‌గౌడ్ పిలుపు
- కేంద్ర బడ్జెట్‌లో కాంగ్రెస్ పార్టీ నిరసన



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నిరసన చేపట్టింది. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టినటువంటి నిరసన కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. దేశాభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం ఎంతో సహాయపడుతుంటే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం పట్ల వివక్ష చూపిందని మండిపడ్డారు. కేంద్రం వివక్షను ప్రజాక్షేత్రంలోనే ఎండగట్టాలని మిగతా 2 లో..

## 4న తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

- కులగణన నివేదికపై చర్చించనున్న కేబినెట్
- బీసీ రిజర్వేషన్ల పెంపుపై నిర్ణయం తీసుకునే చాన్స్

తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం జెట్ స్పీడ్‌తో కదులుతోంది. కీలకమైన బీసీ రిజర్వేషన్లను తేల్చే అంశాన్ని చివరి అంఖానికి చేరింది. ఫిబ్రవరి 4న తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. మిగతా 2 లో..

# కులగణన సర్వే విజయవంతం

## తెలంగాణలో బీసీ జనాభానే ఎక్కువ

- సామాజిక న్యాయం కోసమే ఈ సర్వే
- తెలంగాణలో ఎస్సీల జనాభా 17.43 శాతం
- ఎస్టీల జనాభా 10.45 శాతం
- బీసీల జనాభా 46.25 శాతం
- ముస్లిం మైనారిటీల జనాభా 12.56 శాతం
- ఓసీల జనాభా 15.79 శాతం
- రాష్ట్రవ్యాప్తంగా 3,54,77,554 మంది వివరాల నమోదు
- 1,12,15,131 కుటుంబాల వివరాలు నమోదు
- కులగణన సర్వేలో పాల్గొన్న జనాభా 96.90 శాతం
- సర్వేలో పాల్గొనని జనాభా 3.10 శాతం
- తెలంగాణలో కుల గణన సర్వే వివరాలు వెల్లడి
- వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- కులగణనపై మంత్రివర్గ ఉపసంఘానికి అందిన నివేదిక
- కులగణన అంశంపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశం



వెనుకబడిన తరగతులకు న్యాయం చేయాలన్నదే తమ ఆకాంక్ష అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా రాష్ట్రంలో కులగణన అంశంపై కేబినెట్ సబ్ కమిటీకి(మంత్రివర్గ ఉపసంఘం) నివేదిక అందజేశారు. కులగణనపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ ముగిసిన అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఆశయం మేరకు రాష్ట్రంలో సామాజిక, కులగణన సర్వే చేపట్టామని ఆయన వెల్లడించారు. స్వాతంత్ర్యం పూర్వం నుంచి మనదేశంలో జనగణన మిగతా 2 లో..

## అండర్ -19 ఉమెన్స్ టీ20 విశ్వవిజేత భారత్

అండర్ -19 ఉమెన్స్ టీ20 లో భారత్ విశ్వవిజేతగా నిలిచింది. 2025 వరల్డ్ కప్ లో గెలిచింది. ఆదివారం సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్‌మ్యాచ్ లో భారత్ 9 వికెట్ల తేడాతో అఖండ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ సాధించిన సఫారీ జట్టు కేవలం 82 పరుగులకే ఆలౌటైంది. మన బౌలర్లు సఫారీ జట్టుపై విజృంభించారు.త్రిష 3, పరునిక, ఆయూషి, వైష్ణవి తలో 2, షబ్నమ్ 1 వికెట్ దక్కించుకున్నారు.దీంతో సౌతాఫ్రికా జట్టు కేవలం 82 పరుగులే చేసి ఆలౌట్ అయింది.



## నేటినుండి ఇంటర్ ప్రాక్టికల్స్

ఇంటర్మీడి యట్ ప్రాక్టికల్ పరీక్షలను ఈసారి మాస్ కాపీయిం గ్‌కు అవకాశం లేకుండా నిఘా నీడలో నిర్వహించేం దుకు ఇంటర్మీడియెట్ మిగతా 2 లో..

# బిల్డర్లను రోడ్డున పడేస్తున్న హైడ్రా

## భేషజాలకు పోకుండా హైడ్రా ఆపండి

**బిల్డర్లలో పాజిటివిటి లోపించింది**

- పదవులు శాశ్వతం కాదు.. ప్రజల ప్రాణాలు ముఖ్యం
- బీఆర్ఎస్ పాలనలో నిర్మాణ రంగానికి పెద్దపీట
- హైదరాబాద్, తెలంగాణ స్వర్గధామంగా ఉండేది
- అద్భుతంగా పదేండ్లు వృద్ధిలో రియల్ ఎస్టేట్ రంగం
- కాంగ్రెస్ పాలనలో కుదైలైన రియల్ ఎస్టేట్ రంగం
- అనాలోచిత నిర్ణయాల వల్ల ఈ దుస్థితి
- హైడ్రాపై హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజం
- బిల్డర్ వేణుగోపాల్ రెడ్డి ఆత్మహత్య
- నా చావుకు కారణం రేవంత్‌రెడ్డే నంటూ లేఖ
- హైడ్రాతో బ్యాంకుల లోన్లు వస్తలేవని ఆవేదన
- వేణుగోపాల్ రెడ్డి కుటుంబానికి హరీశ్‌రావు పరామర్శ

బిల్డర్లను రోడ్డున పడేస్తూ, వారి ఆత్మహత్యలకు కారణమవుతున్న హైడ్రాపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా భేషజాలకు పోకుండా హైడ్రా దుకాణం బంద్ చేయాలని హరీశ్‌రావు హెచ్చరించారు. బిల్డర్ వేణుగోపాల్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మాణ రంగానికి మన హైదరాబాద్, తెలంగాణ స్వర్గధామంగా ఉండే. అద్భుతంగా పదేండ్లు వృద్ధిలో నడిచింది రియల్ ఎస్టేట్ రంగం. లక్షలాది మంది బతికారు. కానీ కాంగ్రెస్ పాలనలో అనాలోచిత నిర్ణయాల వల్ల.. రియల్ ఎస్టేట్ రంగం కుదైలైంది. ఇప్పటికైనా భేషజాలకు పోకుండా హైడ్రా దుకాణాలు బంద్ చేయండి.. హైడ్రా వల్ల అపార్ట్‌మెంట్లు అమ్ముడు పోవడం లేదు. హైడ్రా భయంతో కొనేందుకు వెనుకడుగు వేస్తున్నారు. చేసిన అప్పులకు మిత్తిలు కట్టలేకపోవడం, లోన్లు రాకపోవడం, భవిష్యత్ ఆగమ్య గోచరంగా మారడం, నమ్మకం కుదరక చివరకు ప్రాణాలు తీసుకుంటున్నారు మిగతా 3 లో..



# సంపాదకీయం

## బీహార్ ఎన్నికల కోసం బడ్జెట్ ఇంధనం

ఈ ఏడాది చివర్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. అక్కడ ప్రస్తుతం నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్‌డిఎ సర్కార్ ఉంది. అక్కడ మరోమారు అధికారం కోసం ఎన్‌డిఎ ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం బీహార్‌లో జేడీయూతో కలిసి బీజేపీ అధికారాన్ని పంచుకుంటోంది. అలాగే కేంద్ర ప్రభుత్వంలో జేడీయూ కీలక భాగస్వామి. బీహార్‌కు ప్రత్యేక హోదా కల్పించాలనే డిమాండ్‌ను పక్కన పెట్టిన కేంద్రం.. బడ్జెట్‌లో కీలక కేటాయింపులు చేసింది. బీహార్‌లో ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ క్రమంలో బీహార్‌పై బడ్జెట్‌లో వరాల జల్లు కురిపించారు. తాజా బడ్జెట్‌లో బీహార్‌కు ప్రత్యేక కేటాయింపులు చేశారు. బీహార్‌లో మఖానా బోర్డు ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. మఖానా వ్యాపారం కోసం రైతుల సౌకర్యార్థం ఈ బోర్డు పని చేయబోతోంది. అలాగే బీహార్‌లోని మిథిలాంచల్ ప్రాంతంలో యాభై వేల ఎకరాలకు ప్రయోజనం చేకూర్చే వెస్ట్రన్ కోసి కెనాల్‌కు ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఇక, బీహార్‌లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. అలాగే ఐఐటీ పట్నాను కూడా విస్తరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఫుడ్ ప్రాసెసింగ్ కార్యకలాపాలకు మద్దతు ఇచ్చేందుకు బీహార్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. కేంద్రంలో ఎన్డీయే కూటమిలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పూర్తిస్థాయి తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా బీహార్ పై వరాల జల్లు కురిపించారు. అసెంబ్లీ ఎన్నికలకు వెళ్తున్న ఆ రాష్ట్రానికి నాల్గు పద్దుల్లో ప్రత్యేక స్థానం దక్కింది. 'బీహార్‌లో ఏర్పాటుచేయనున్న మఖానా బోర్డు ద్వారా వాటి ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపడనున్నాయి. దీనికింద రైతులకు శిక్షణ అందుతుంది. వారు అన్ని ప్రభుత్వ పథకాల నుంచి ప్రయోజనం పొందేలా బోర్డ్ చూస్తుంది' అని మంత్రి వెల్లడించారు. పదేళ్లలో 4 కోట్ల మందికి విమాన ప్రయాణం కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్న కేంద్రం ఆ దిశగా బీహార్‌లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. బీహార్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ ఏర్పాటుచేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. దీనిద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ కార్యకలాపాలకు మరింత మద్దతు అందనుంది. బీహార్‌కు ప్రత్యేక హోదా సాధ్యం కాదని తేల్చిచెప్పిన కేంద్రం.. ఎన్నికల ముందు ఇలా వరాల జల్లు కురిపించింది. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల తర్వాత జులైలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా రహదారుల అభివృద్ధి, గంగానది రెండు వంతెన నిర్మాణం, విద్యుదుత్పత్తి కేంద్రం వంటి పలు ఆర్థిక వరాలు ఇచ్చింది. ఇకపోతే ద్రవ్యోల్బణం అదుపు చేసి, రూపాయిని నిలబెట్టే ప్రయత్నాలేవీ బడ్జెట్ ప్రసంగంలో కానరాలేదు. దీనికితోడు ఆర్థిక సర్వేనూ దిద్దుబాటు చర్యలు కానరాలేదు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం వంటివన్నీ యధావిధిగానే ఉన్నాయి. చిన్నతరహా పరిశ్రమలకు(క్రెడిట్‌గ్యారెంటీ పెంచడం కొంత ఊతమిచ్చే విషయంగానే చూడాలి. నిజానికి దేశంలో ప్రజల కొనుగోలు శక్తి పెరగాలి. వస్తువుల ధరలు తగ్గాలి. నిత్యవసర వస్తువుల ధరలు దిగిరావాలి. పెట్రో, డీజీల్, గ్యాస్ ధరలు తగ్గితేనే పేద, మధ్యతరగతి ప్రజలు ఏదైనా కొనగలరు. మార్కెట్లో డబ్బులు చలామణి కావాలి. అందుకు అనుగుణంగా వస్తూత్పత్తి కూడా పెరగాలి. ఆహారధాన్యాల దిగుబడులు పెరగడంతో పాటు,వాటి ఎగుమతులు కూడా ఇతోధికంగా పెరగాలి. అలాగే దేశంలో ఇప్పటికీ పప్పు దినుసులు, వంటనూనెల కొరత అధికంగా ఉంది. ఆ కొరతను అధిగమించేందుకు ఇప్పటికీ భారీ పరిమాణంలో వాటిని దిగుమతి చేసుకుంటున్నాం. అవసరాన్ని మించి తృణ ధాన్యాలు ఉత్పత్తి చేయడాన్ని నిలువరించి పప్పులు, నూనెగింజల ఉత్పత్తిని పెంచడం అవసరమన్న విషయం సర్వే తేల్చి చెప్పింది. ఒకపక్క మార్కెట్ ధరల్లో ఆటుపోట్ల నుంచి రైతులకు రక్షణ కల్పించేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు కావడంతో పాటు మరోపక్క సాధారణ గృహస్థులకు రక్షణ కల్పించే సమగ్రంత వ్యవస్థ ఒకటి ఉండాలని సూచించింది. ఇక ఎగుమతుల ఉ త్రేజితం చేయాలంటే వాణిజ్య సంబంధిత వ్యయాలు తగ్గించేందుకు చర్యలు తీసు కోవాలని తేల్చి చెప్పారు. అప్పుడే భారత్ పోటీ సామర్థ్యం పెంచుకోగలుగుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థ గత కొన్ని సంవత్సరాలుగా పోల్చితే అంతంతమాత్రంగానే ఉన్నదన్న విషయం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే తేల్చి చెప్పింది. మన ఆర్థిక వృద్ధిరేటు ఇప్పటికీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నింటితో పోల్చితే బలంగానే ఉన్నప్పటికీ దేశీయంగాను, అంతర్జాతీయంగాను పలు సవాళ్లు ఎదుర్కొంటోంది. ప్రధానంగా డాలర్‌తో మారకం విషయంలో రూపాయి విలువ పడిపోతోంది. దీంతో దిగుమతులపైన తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో 2025–26 ఆర్థిక సంవత్సరానికి వృద్ధిరేటు 6.3 నుంచి 6.8 శాతం మధ్యన ఉ ఒడవచ్చునని అంచనా వేసినా, అందుకు తగ్గట్లుగా చర్యలు ఉండాల్సిందే. దేశంలో శ్రమశక్తిని వినియోగించుకుని వస్తూత్పత్తిని పెంచితే తప్ప ఇది సాధ్యం కాదు. 2047 నాటికి వికసిత్ భారత్ కావాలన్న లక్ష్యం నెరవేరాలంటే ఈ వృద్ధిరేటు ఏ మాత్రం సరిపోదు. ఏడాదికి సగటున ఎనిమిది శాతం వృద్ధిని సాధిస్తే తప్ప మనం ఆ లక్ష్యాన్ని చేరడం సాధ్యం కాదు. గత కొన్నేళ్లుగా ఉన్న సానుకూలతలు క్రమక్రమంగా కనుమరుగవుతున్నాయి. అంతర్జాతీయంగా వస్తున్న ఒడిదుడుకుల కారణంగా ఆర్థిక వ్యవస్థల్లో తరచూ మందగమనం ఎదురవుతోంది. ఎగుమతుల రంగం ఎదురీదుతోంది. ప్రస్తుతం ప్రపంచ వాణిజ్యంలో భారతదేశం వాటా కేవలం 2 శాతం మాత్రమే ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం లో మన ఎగుమతుల వృద్ధిరేటు 1.6 శాతానికే పరిమితం అయింది. ఈ క్రమంలో ప్రపంచంలోనే మన వాణిజ్య ఉ త్పత్తులకు డిమాండ్ పెరిగేలా చేయాలి. చైనా వస్తూత్పత్తి రంగంలో ముందుస్థానంలో ఉంది. చైనా వస్తువులు ప్రపంచ మార్కెట్ ను శాసిస్తున్నాయి. దీంతో చైనా ఆర్థికంగా బలపడడానికి కారణం అవుతోంది. ఇకపోతే దేశీయంగా కొనుగోలు శక్తి పెరిగే ఉ ద్దీపనలు బడ్జెట్‌లో కానరాలేదు. వేతనజీవులు, మధ్యతరగతి జీవుల సొంతింటి కల నిజం చేసుకునేలా చర్యలు లేవు. ఇలాచేసివుంటే ఆర్థికంగా ఎదుగుదలకు అవకాశం ఉండేది. నిర్మాణ రంగానికి సంబంధించిన వస్తువుల ధరలు తగ్గాలి. అలాగేమోటార్ వెహికల్ రంగం పుంజుకుంటే దానితో పెనవేసుకున్న అనేక రంగాలు వృద్ధికి వస్తాయి. నిరుద్యోగం బాగా తగ్గుతుంది. విదేశాల నుంచి ఎదురవుతున్న సవాళ్లతో పాటే దేశీయంగా ద్రవ్యోల్బణం పెనుభూతంగా ఉంది. గత ఏడాది రుతుపవనాల సానుకూలత కారణంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కొనుగోలుశక్తి పెరిగినప్పటికీ నగర జీవులు మాత్రం ధరల కాటుకు విలవిలలాడుతూనే ఉ న్నారు. ఫలితంగా వారి కొనుగోలు శక్తి తగ్గిపోయింది.

## ఆర్జీకర్ మెడికల్ కాలేజీలో విద్యార్థిని ఆత్మహత్య

కోల్‌కతా ఆర్జీకర్ మెడికల్ కాలేజీలో అత్యాచార ఘటన మరువక ముందే మరో 20 ఏళ్ల వైద్య విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవటం కలకలం రేపింది. రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని.. తన హాస్టల్ క్వార్టర్ లో సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని కనిపించింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై హాస్పిటల్ వద్ద విద్యార్థిని తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు.కోల్‌కతా ఆర్జీకర్ మెడికల్ కాలేజ్.. ట్రైనీ డాక్టర్ పై అత్యాచారం, హత్య జరిగిన సంఘటనపై ఈ కాలేజ్ దేశవ్యాప్తంగా చర్చనీయ అంశంగా మారింది. ఈ ఏడాది జనవరి 20న ఈ కేసులో నేరస్థుడిగా సంజయ్ రాయ్ ను తేల్చిన కోర్టు జీవిత ఖైదు విధించింది. ఈ ఘటన మరువకముందే మరో వైద్య విద్యార్థిని తన రూమ్ లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. చనిపోయిన విద్యార్థిని ఐవీ ప్రసాద్ గా గుర్తించిన పోలీసులు.. మృతురాలు ఆ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు. ఐవీ ప్రసాద్ తన గదిలో ఒంటరిగా ఉన్న సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. శు క్రవారం ఆమె తల్లి పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందించకపోవడంతో అనుమానం వచ్చి వెంటనే హాస్పిటల్ క్వార్టర్స్ కి వచ్చి చూసింది. గది తలుపులు మూసి ఉండటంతో వెంటనే బద్దలు కొట్టి చూడగా సీలింగ్ కు ఉరివేసుకొని కనిపించింది. వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మరణంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని కుటుంబ సభ్యులు చెప్పటంతో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే బాధితురాలి గదిలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదు. ఆమె కొన్నాళ్లుగా డిప్రెషన్ తో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. కోల్‌కతా ఆర్జీకర్ మెడికల్ కాలేజ్ యాజమాన్యంపై ట్రైనీ డాక్టర్ అత్యాచారం సమయంలోనే పలు ఆరోపణలు ఎదురయ్యాయి. ఈ కాలేజీలో విద్యార్థులకు రక్షణ లేదని, సరైన విద్యా అందించకపోవడంతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని.. సరైన విద్యా అందించకపోవటంతో ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు ఎదురయ్యాయి. ఈ క్రమంలోనే తీవ్ర నిరసనలు సైతం ఎదురయ్యాయి. ఇక ఇప్పుడు మరో విద్యార్థిని చనిపోవడంతో మెడికల్ విద్యార్థులు తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాలేజీలో ఏం జరుగుతుందో అనే విషయంపై విచారణ జరిపి అసలు విషయాలు బయటకు తీయాలని డిమాండ్ చేస్తున్నారు. మరింత మంది విద్యార్థులు బలికాకుండా చూడాలంటూ నిరసన తెలుపుతున్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు
# అన్యాయం

మొదటిపేజీ తరువాయి..

కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు సాయం చేయాలని పలుసార్లు కేంద్రానికి నివేదికలు ఇచ్చినప్పటికీ పట్టించుకోలేదన్నారు. తెలంగాణ అభ్యున్నతి కోసం రాజకీయాలకు అతీతంగా ప్రతి తెలంగాణ పౌరుడు ఏకతాటిపైకి రావాలిసిన అవసరం ఉందని మంత్రులు సీతక్క, పొన్నం అన్నారు. రాష్ట్ర ప్రజలు ఎనిమిది మంది ఎంపీలను గెలిపించినప్పటికీ నిధులను రాబట్టడంలో వారు పూర్తిగా విఫలం చెందారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి సహా మంత్రులు పలు దఫాలుగా ప్రధాని మోదీ సహా కేంద్ర మంత్రులను రాష్ట్ర అభివృద్ధి కోసం నిధులు అడిగినప్పటికీ నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సంక్షేమం, అభివృద్ధి కోసం రాజకీయాలను పక్కన పెట్టి పార్టీలకు అతీతంగా కలిసి రావాలని కోరారు. కేంద్ర నిధులు ఇచ్చే వరకు శాంతియుతంగా పోరాటం చేస్తామని తేల్చి చెప్పారు. ధుల కేటాయింపుల్లో తెలంగాణ రాష్ట్రానికి ఏటా అన్యాయం జరుగుతోంది. జీడీపీలో(స్థూల దేశీయోత్పత్తి) రాష్ట్ర వాటా 5 శాతం ఉన్నా తెలంగాణకు ఎప్పుడూ మొండిచేయే. కేంద్రంపై యుద్ధం ప్రకటించి తెలంగాణకు నిధులు సాధించాలి. అన్ని పార్టీలు ఏకమై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగానే నిధులు ఇవ్వకుండా వివక్ష చూపుతోందని , పార్టీలకు అతీతంగా అందరం ఏకమై రాష్ట్రాభివృద్ధి కోసం నిధులు రాబట్టేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకువద్దామని కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, పలువురు కార్పోరేషన్ ఛైర్మన్ లు ప్రజలకు పిలుపునిచ్చారు.



## 4న తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

మొదటిపేజీ తరువాయి..

కులగణన నివేదికపై చర్చించనుంది కేబినెట్. అదేరోజు తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం కానుంది.సభలో కులగణన నివేదికపై స్వల్పకాలిక చర్చ నిర్వహిస్తారు. ఇప్పటికే కేబినెట్ సబ్‌కమిటీకి కులగణణ నివేదిక అందింది. బీసీ రిజర్వేషన్ల పెంపుపై ఒక నిర్ణయం తీసుకుని, పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని రేవంత్‌రెడ్డి సర్కార్ యోచిస్తుంది. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపే అవకాశం ఉంది. కులగణన సర్వేలో 55.85 శాతంగా బీసీలు ఉన్నాట్లు తేల్చారు. కొత్త లెక్కల ప్రకారం పథకాలు, రిజర్వేషన్ల అమలుకు సన్నాహాలు చేస్తున్నారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా.. రిజర్వేషన్ల అమలుకు కసరత్తు చేస్తోంది కాంగ్రెస్ సర్కార్. బీసీలకు 40 శాతం కోటా పెంచుతామని ఎన్నికల టైమ్‌లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. మొత్తం 50 రోజుల పాటు కులగణన సర్వే నిర్వహించారు. సర్వేలో లక్షా 3,889 మంది అధికారులు పాల్గొన్నారు. 96.9శాతం కుటుంబాలను సర్వే చేశారు అధికారులు. సర్వేలో 3 కోట్ల 54 లక్షల మంది తమ వివారాలను వెల్లడించారు. 3.1శాతం సర్వేలో పాల్గొనలేదని కమిషన్ రిపోర్టులో పేర్కొంది. ఫిబ్రవరి 5న మధ్యాహ్నం తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం కానుంది. సభలో కులగణన నివేదిక ప్రవేశపెట్టనుంది ప్రభుత్వం. నివేదికపై చర్చ అనంతరం సభ ఆమోదం తెలపనుంది.మార్చి 5 నుంచి ఇంటర్, మార్చి 17 నుంచి పదోపరీక్షల షెడ్యూల్ ఉంది. పంచాయతీ ఎన్నికలు ఫిబ్రవరిలో నిర్వహిస్తే పరీక్షల నిర్వహణకు ఏమైనా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందా? అనే కోణంలో ప్రభుత్వం అంచనా వేస్తోంది. అయితే స్థానిక ఎన్నికలతో ఇంటర్‌పరీక్షలకు పెద్దగా ఇబ్బంది ఉండదని, పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి జరగనున్నందున ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు పెడితే సమస్య లేదని అధికారులు సీఎంకు రేవంత్‌కు సూచించినట్లు సమాచారం.

# రాష్ట్రానికి మొండిచేయి



మొదటిపేజీ తరువాయి..


ఎలాంటి ప్రత్యేక ప్రస్తావన ఊసేలేదు. కేంద్ర పన్నుల్లో వాటాగా రాష్ట్రానికి 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.29,899 కోట్లు వస్తాయని బడ్జెట్‌లో పేర్కొన్నారు. మొత్తం రూ.14,22,444 కోట్లలో రాష్ట్ర వాటా అయిన 2.104 శాతం ప్రకారం ఈ మొత్తం వస్తుంది. కార్పొరేట్ పన్నులో రూ. 8,349 కోట్లు, ఆదాయపన్ను వాటాగా రూ. 11,140 కోట్లు, సెంట్రల్ జీఎస్టీ నుంచి రూ.8704 కోట్లు, కస్టమ్స్ ద్వారా రూ.376 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ సుంకం నుంచి రూ.285 కోట్లు రానున్న ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి వస్తాయి. కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా కింద 2024–25 లో రూ.26,216 కోట్లు ప్రతిపాదించి రూ.27,050 కోట్లకు అంచనాలను సవరించారు. వచ్చే ఏడాది రూ.3000 కోట్లు అదనంగా రానున్నాయి. ఇక ఎన్డీఎంఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, ఇతర గ్రాంట్లు – నిధులు, స్థానిక సంస్థలకు ఆర్థిక సంఘం నిధులు, వైద్య, ఎస్డీఆర్ఎఫ్ నిధులు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద 2025–26 లో రాష్ట్రానికి మరో రూ.30 వేల కోట్లకు పైగా వస్తాయని అంచనా.

రాష్ట్రంలో ఉన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో సముద్ర పరిశోధనా, సమాచార కేంద్రం ఇన్‌కాయిస్‌కి 29 కోట్లు, అణు ఇంధన ఖనిజాల తవ్వకాల సంస్థకు 387.50 కోట్లు కేటాయించారు. నైపర్, ఐఐటి హైదరాబాద్, రెండు రాష్ట్రాల్లోని గిరిజన విశ్వ విద్యాలయాలకు గతంలో నేరుగా బడ్జెట్‌లో నిధులు కేటాయించినా ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి పలికారు. ఆయా సంస్థలకు ఇప్పటికే ప్రత్యేక పద్దులు ఉన్న నేపథ్యంలో ఆయా మంత్రిత్వ శాఖల విభాగాల నుంచే నిధులు వెళ్లేలా ఏర్పాటు చేశారు. ఐఐటిలు, ఐఐఎంలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలను ఒకే జాబితాగా చేర్చి వాటికి ఉన్న పద్దు కింద నిధులు ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఐఐటి హైదరాబాద్‌కు విదేశాల నుంచి రుణాలు ఈఏపీ కింద తీసుకునే జాబితాలో చేర్చారు. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న కేంద్ర సంస్థలు జాతీయ మత్స్య సంపద అభివృద్ధి బోర్డుకు, నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులకు కేంద్ర హోం శాఖ ద్వారా ఇచ్చే పెన్షన్లు, ఐపీఎస్ అధికారుల శిక్షణా కేంద్రం వల్లభాయ్ పటేల్ అకాడమీకి, జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ సంస్థ – ఎన్ఐఆర్‌డికి, అంతర్జాతీయ పౌడర్ మెటలర్జీలకు ఆయా శాఖల ద్వారా నిధులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు బడ్జెట్‌పై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు సూక్ష్మ పరిశీలన చేశారు. ఏ శాఖ ద్వారా కూడా తెలంగాణ ప్రత్యక్ష ప్రయోజనాలు పొందే పథకాలు, కార్యక్రమాలు కనిపించలేదు. పరోక్ష ప్రయోజనాలను అన్వేషించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అధికారులు తెలిపారు. కాగా ర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం మొత్తంలో బిహార్, అస్సాం, గుజరాత్, అండమాన్ నికోబార్, ఈశాన్య రాష్ట్రాల పేర్లు, అక్కడి ప్రాజక్టుల ప్రస్తావన మినహా మరే రాష్ట్రం పేరు ప్రస్తావించలేదు. ఈ ఏడాది చివరి త్రైమాసికంలో ఎన్నికలు జరిగే బిహార్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఐతే, కొన్ని రాష్ట్రాలకు ఇచ్చిన ప్రత్యేక ప్యాకేజీకి అనుగుణంగా నిధులు ఇచ్చారే తప్ప ఏ రాష్ట్రానికి ఎలాంటి నష్టం వాటిల్లలేదని కేంద్ర మంత్రులు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తమ ప్రతిపాదనలను ఏమాత్రం పట్టించుకోలేదని మండిపడింది. కేంద్ర బడ్జెట్లో తెలంగాణ రైల్వేకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర బడ్జెట్ మొత్తం త్వరలో ఎన్నికలు జరగనున్న బీహార్ కేంద్రంగానే రూపొందించారు తప్పా.. మిగతా రాష్ట్రాల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని అంటున్నారు. ముఖ్యంగా.. కోకాపేట కోచ్ ఫ్యాక్టరీ పై ఎలాంటి స్పందన లేకపోవడాన్ని రాష్ట్ర నాయకత్వం విమర్శిస్తోంది. రైల్వేస్టేషన్ ఆధునీకరణ, డబ్లింగ్ పనులకు కూడా బడ్జెట్లో పెద్దగా కేటాయింపులు జరపలేదని అంటున్నారు. బడ్జెట్లో రైల్వేలకు భారీ నిధుల ప్రకటన ఉంటుందని మొదటి నుంచి ఆశ పెట్టుకున్నారు. కానీ అనుకున్న అంచనాలకు దరిదాపుల్లోనూ కేటాయింపులు రాలేదు. రైల్వే శాఖకు మొత్తంగా రూ.2,65,200 కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టగా.. అందులో అత్యధికంగా భద్రత, ఎలక్ట్రిఫికేషన్ కి కేటాయించారు. రైల్వే బడ్జెట్ లో పెన్షన్ ఫండ్ కింద రూ.66 వేల కోట్లు కేటాయించినట్లు తెలిపిన కేంద్రం.. కొత్త లైన్లు వేయటానికి రూ.3,235 కోట్లు వెచ్చించనుంది. రైల్వే సేఫ్టీ ఫండ్ కు రూ.45,000 కోట్లు కేటాయిస్తూ నిర్మలా సీతారామన్ ప్రతిపాదనలు చేశారు. కాగా.. ఈ మొత్తం బడ్జెట్లో తెలంగాణకు మొండి చేయి చూపించారంటూ తెలంగాణ వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిగతా బడ్జెట్ తో పాటు రైల్వే బడ్జెట్ లో ను రాష్ట్రానికి నిరాశ మిగిల్చారని అంటున్నారు. రాష్ట్రంలో విపక్ష పార్టీ అధికారంలో ఉండటంతోనే ఈ వివక్ష చూపించారు అంటున్న రాష్ట్ర నాయకులు.. బీహార్ల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్కడే భారీగా నిధులు కేటాయించిందని, తెలంగాణ ప్రభుత్వానికి మాత్రం మొండి చెయ్యి చూపిందని ఆగ్రహిస్తున్నారు. కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి సంబంధించిన రైల్వే ప్రాజెక్టులకు భారీగా కేటాయింపులు చేస్తారని తెలంగాణ ప్రభుత్వం ఆశించింది. ఇందుకోసం ఇప్పటికే ప్రతిపాదనలో ఉన్న కొత్త రైల్వే మార్గాలు, రైళ్లు, అదనపు లైను నిర్మాణానికి ఏకంగా రూ.83 వేల కోట్ల అవసరమవుతాయని అంచనాలు వేసిన రాష్ట్ర అధికారులు.. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి అనేకమార్లు విన్నపాలు పంపించారు. తెలంగాణలోని ఇంకా తొమ్మిది జిల్లాలకు అసలు రైలు మార్గమే లేకపోవడంతో ఆయా జిల్లాలకు రైల్వే సౌకర్యం కల్పించాలని తెలంగాణ వాసులు ఎప్పటినుంచో కోరుతున్నారు. అయినా వీటిలో వేటిపై కేంద్రం కరుణ చూపించలేదు. తెలంగాణ ప్రభుత్వం రైల్వే ప్రాజెక్టులో నిధులు దక్కుతాయని ఆశించిన వాటిలో వేటికీ నిధులు దక్కలేదు. హైదరాబాద్ నగరంలో మెట్రో రైల్ రెండో దశ విస్తరణను పెద్ద స్థాయిలో చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి కేంద్ర ప్రభుత్వం నుంచి సహాయం ఆశించగా నిరాశే ఎదురైంది. కొత్తగా నిర్మిస్తున్న రీజనల్ రింగ్ రోడ్డుకు అనుబంధంగా రీజనల్ రింగ్ రైల్వే లైన్ నిర్మిస్తామని కేంద్రంలో గతంలో తెలపగా.. దానికి రూ.12,500 కోట్లు కావాలని ప్రాథమిక అంచనా వేశారు. ఈ విషయమై కేంద్రం నోరు మెదపలేదు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి విజయవాడకు 220 కిలోమీటర్ల వేగంతో వెళ్లే సెమీ హై స్పీడ్ రైల్వే ప్రాజెక్టుకు గతేడాది రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. దీని సర్వే ఏడాదిగా జరుగుతుండగా.. ఈ ప్రాజెక్టుకు ఎటువంటి నిధులు కేటాయింపులు చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. వీటితో పాటే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కానీ, రాష్ట్రంలో మూడు రైల్వే లైన్ నిర్మాణం గురించి కానీ కేంద్రం పెద్దగా పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు

# కులగణన సర్వే విజయవంతం

మొదటిపేజీ తరువాయి..

జరుగుతోందని, అసలైన పేదలను గుర్తించేందుకు కులగణన మాత్రం జరగలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కులగణన చేయాలని అసెంబ్లీ తీర్మానించిందని వివరించారు. బలహీనవర్గాల అభ్యున్నతికి అవసరమైన వివరాల సేకరణకు కులగణన చేపట్టామన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి సామాజిక కులగణన సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్లు పాల్గొన్నారని తెలిపారు. 96.9శాతం (3.50 కోట్ల మంది) మంది సర్వేలో పాల్గొని వివరాలను అందించారని ఉత్తమ్ కుమార్



రెడ్డి వివరించారు. 3.1శాతం (16లక్షల మంది) వివిధ కారణాల వల్ల వివరాలు అందించలేదని తెలిపారు. ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి ఇతర అంశాలపై సమగ్ర అధ్యయనం జరిగిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సర్వేను అడ్డుకోవాలని కొందరు ప్రయత్నించినా అధికారులు విజయవంతంగా పూర్తి చేశారని వివరించారు. ఈనెల 4న మంత్రివర్గం ముందు కులగణన సర్వే నివేదిక ప్రవేశపెడతాని ఆయన వెల్లడించారు. కేబినెట్‌లో చర్చించి వెంటనే శాసనసభలో ప్రవేశ పెడతామన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాజంలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ముందుకెళ్తోందని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

## చిక్కుల్లో రామ్‌దేవ్ బాబా!

మొదటిపేజీ తరువాయి..

చేసింది. పతంజలి సంస్థకు చెందిన దివ్య ఫార్మసీ ఉ త్పత్తులపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు, తప్పుడు ప్రచారాలు జరగడంతో కేరళ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ వారిపై కేసు నమోదు చేశారు. ఇదే కేసుపై పాలక్కాడ్ జిల్లా కోర్టు విచారణ చేపట్టింది. అయితే ఫిబ్రవరి 1న విచారణకు రావాలని కోర్టు ఆదేశించినా



రాకపోవడంతో ఇద్దరిపై అరెస్ట్ వారెంట్ జారీ చేసింది న్యాయస్థానం. ఈనెల 15న మరోసారి విచారణ చేపట్టనున్నట్లు కోర్టు స్పష్టం చేసింది. పతంజలి ఆయుర్వేద ఉత్పత్తులకు సంబంధించిన ప్రకటనలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, అబద్ధాలను ప్రచారం చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కారణంగా కేరళ డ్రగ్ ఇన్ స్పెక్టర్ వారిద్దరిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.. ఈ కేసు విచారణలో భాగంగా పాలక్కాడ్ కోర్టు బాబా రాందేవ్ కు, ఆచార్య బాలకృష్ణకు గతంలో నోటీసులు పంపించింది. కాగా, పతంజలి అనుబంధ సంస్థ దివ్య ఫార్మసీకి చెందిన పది ఉత్పత్తులపై ప్రభుత్వం గతంలోనే వేటు వేసింది.ఆ ఉత్పత్తులకు సంబంధించి ప్రసార మాధ్యమాల్లో విడుదల చేసిన ప్రకటనలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని పేర్కొంటూ వాటి తయారీ లైసెన్స్ ను సైతం కోర్టు రద్దు చేసింది. ఉత్పత్తులకు సంబంధించి తయారీ లైసెన్స్‌ను కూడా రద్దు చేసింది. కాగా, దీనిపై పతంజలి సంస్థ సీఈవో, రాందేవ్ బాబా ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే మరీ. రాందేవ్ బాబా నియమితంగా హాజరు కాకపోవడంతో, పాలక్కాడ్ కోర్టు జనవరి 16న వీరిపై బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసిన విషయం తెలిసిందే.ఈ కేసు నేపథ్యంలో.. పతంజలి అనుబంధ సంస్థ దివ్య ఫార్మసీకి చెందిన పది ఆయుర్వేద ఉత్పత్తులపై కేంద్రం ఇప్పటికే నిషేదం విధిస్తూ హెచ్చరికలు జారీ చేసింది. అవి ఆ సమయంలో తప్పుడు ప్రకటనల ద్వారా ప్రజలను మోసగిస్తున్నాయని ఆరోపణలొచ్చాయి. ఈ నేపథ్యంలో ఆ ఉత్పత్తుల తయారీ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు, సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పతంజలి సంస్థపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ కేసు మరింత సంచలనంగా మారింది.

## ఏప్రిల్ 1 నుంచి జేఈఈ మెయిన్ -2 పరీక్షలు

మొదటిపేజీ తరువాయి..

విషయం తెలిసిందే. ఈ పరీక్షను ఏటా రెండుసార్లు నిర్వహిస్తుండగా, మెయిన్ -2 పరీక్ష షెడ్యూల్‌ను ఎన్టీఏ తెలిపింది. జేఈఈ మెయిన్ -2కు ఎప్‌సెట్ పరీక్షకు మధ్య వ్యవధి 20 రోజులే ఉండనుంది. ఈ ఏడాది ఎప్‌సెట్‌ను ఏప్రిల్ 29 నుంచి మే 5 వరకు నిర్వహించనున్న విషయం తెలిసిందే. జేఈఈ పరీక్షలు ముగిసిన తర్వాత ఎప్‌సెట్ పరీక్షలు జరగనుండగా విద్యార్థుల మధ్య ఒత్తిడి తగ్గే అవకాశాలున్నట్లు నిపుణులు అంచనాలేస్తున్నారు.

## నేటినుండి ఇంటర్ ప్రాక్టికల్స్

మొదటిపేజీ తరువాయి..

బోర్డు ఏర్పాట్లు చేసింది. ఫిబ్ర వరి 3వ తేదీ నుంచి 20 రోజుల పాటు జరిగే ఈ పరీక్షలపై నిఘాను పటిష్టం చేసింది. గతంలో ఎన్న డూ లేనివిధంగా సీసీ కెమెరాల నిఘాలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలని ఇంటర్ బోర్డు కార్య దర్శి కృష్ణ ఆదిత్య ఇటీవల జిల్లాలోని ఇంటర్ అధి కారులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఆదేశా లు జారీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూళ్లు, కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లోని ప్రయోగశాలలు గల గదుల్లో సీసీ కెమెరాలను బి గించే పనిని హైదరాబాద్ లోని ఒక సంస్థకు అప్ప గించింది. ఇందుకోసం ఒక్కో కళాశాలకు ప్రభుత్వం 12వేల రూపాయలు కేటాయించింది. ఆమేరకు జి ల్లాలోగల కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కూడా పూర్తి కావచ్చింది. ప్రతీయేటా ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో విద్యార్థు లకు ప్రయోగ పాఠాలు బోధించేందుకు అధ్యాపకులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం ఈ సారి ప్రతీ కళాశాలకు 25 వేల రూపాయలను గత నెలలో కేటాయించింది. ఆ మేరకు భౌతిక, రసా య న శాస్త్రాలు, జంతు, వృక్ష శాస్త్రాల ప్రయోగాల కో సం కావాల్సిన పరికరాలు, రసాయనాలను కళాశాల ల్లో సమకూర్చారు. దీంతో నెల రోజుల నుంచి అధ్యా పకులు విద్యార్థులకు ప్రయోగ పాఠాలు బోధిస్తు న్నారు. జిల్లాలో సుమారు 7వేల పైచిలుకు మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రశ్నా పత్రం ఏ రోజుకారోజు ప్రిన్సిపాల్ లాగిన్‌కు మెయిల్ ద్వారా రానుండగా, దాన్ని సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రింట్ తీసుకొని విద్యార్థులకు అంది స్తారు. అక్రమాల నిరోధానికి మునుపెన్నడూలేని వి ధంగా ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ నేపథ్యంలో పలు కళాశాలల యాజమాన్యాలు ఆగమే ఘాల మీద సీసీ కెమెరాల బిగింపు, ప్రాక్టికల్స్‌కు సంబంధించిన పరికరాలు, రసాయనాలు తెప్పించారు.

## ఫిబ్రవరి 5న ఐటీఎఫ్ ఆవిర్భవ వేడుకలు

వేములవాడ, ఫిబ్రవరి 2, సాక్ష్యం:–
ఈ నెల 5వ తేదీన వేములవాడలో ఐటీఎఫ్ ఆవిర్భవా వేడుకలు జరుగుతున్నాయని సంస్థ ఫౌండర్ మారం ప్రవీణ్ కుమార్ (పప్పీ) ఒక ప్రకటనలో



తెలిపారు. ఐటీఎఫ్ సంస్థ స్థాపించి రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా వేములవాడ బద్ది పోచమ్మకు రాష్ట్ర వ్యాప్తంగా వున్న యూట్యూబ్ మహిళ స్టార్ లతో ఘనంగా బోనాలు సమర్పించి, కేక్ కట్ చేసి ఉత్సవాలు జరుపుకుంటమని తెలిపారు. ఈ కార్యక్రమం చాలా మంది స్వచ్ఛందంగా సహాయం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల బాద్యులు మహ్మద్ రఫిక్, ప్రముఖ యూట్యూబ్ ఛానల్ ఓనర్స్ ఆర్టిస్టులు పాల్గొన్నారు.

## నేడు పెద్దపల్లికి ఎమ్మెల్సీ కవిత

పెద్దపల్లి,ఫిబ్రవరి 02,(సాక్ష్యం):
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేడు



పెద్దపల్లికి రానున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించనున్నారు.అనంతరం రాఘవపూర్ లోని తెలంగాణ భవన్ లో టిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో, టీబీజికే ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించి మీడియాతో మాట్లాడుతారు. అనంతరం రామగుండం బీఆర్ఎస్ పార్టీ నాయకులు కౌశిక హరి కూతురు వివాహానికి హాజరుకానున్నారు.

## అండర్ -19 వుమెన్స్ జట్టుకు ఎమ్మెల్సీ కవిత అభినందనలు

టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌లో ఘన విజయం సాధించిన టీమిండియా అండర్–19 వుమెన్స్ జట్టుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ముద్దుబిడ్డ గొంగడి త్రిషపై ప్రత్యేక ప్రశంసల జల్లు కురిపించారు కవిత. ఫైనల్ మ్యాచ్‌లోనూ ఆమె అద్భుతంగా రాణించారని ప్రశంసించారు. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన త్రిషను ప్రత్యేకంగా కవిత అభినందించారు. దేశానికి, తెలంగాణకు ఎంతో గర్వకారణం అని పేర్కొన్నారు. మరోసారి టీ20 వరల్డ్ కప్‌ను తీసుకొచ్చినందుకు వుమెన్స్ జట్టుకు ధన్యవాదాలు తెలిపారు కవిత.

## అన్నపూర్ణ తెలంగాణ.. ఆత్మహత్యల తెలంగాణగా మారింది

- కాంగ్రెస్ ఏడాది పాలనలో కుదేలైన అన్ని రంగాలు
- ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులు, పారిశ్రామిక వేత్తలు
- పదేండ్ల పాలనతో కేసీఆర్ దేశానికే అన్నపూర్ణగా నిలబెట్టాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

కాంగ్రెస్ ఏడాది పాలనలో అన్ని రంగాలు కుదేలయ్యాయని, రైతులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆకలిచావులు, ఆత్మహత్యల తెలంగాణను



పదేండ్ల పాలనతో కేసీఆర్ దేశానికే అన్నపూర్ణగా నిలబెట్టారని చెప్పారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో అన్నపూర్ణ తెలంగాణను ఆత్మహత్యల తెలంగాణను చేశారని మండిపడ్డారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో తెలంగాణ రియల్ ఎస్టేట్‌ను కుదేలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెట్టిన పెట్టుబడులు రాక, మిత్తి కూడా ఎల్లక ఉసురు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్ల పాలనలో వ్యవసాయ రంగానికి చేయూతనిచ్చి కేసీఆర్.. రైతులలో ఆత్మవిశ్వాసం నింపి, వ్యవసాయ రంగానికి వెన్నెముకగా నిలిచారని తెలిపారు. ఏడాది రేవంత్ పాలనలో సాగునీళ్లు లేక, కరంటు రాక, పంటలు కొనుగోలు చేయక, రైతుభరోసా లేక, రుణమాఫీగాక అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. ఇది ప్రజాపాలన కాదని, ప్రజలను వేధించే పాలన అంటూ ఎక్స్ వేదికగా విమర్శించారు.

# బిల్డర్లను రోడ్డున పడేస్తున్న హైడ్రా



మొదటిపేజీ తరువాయి..

అని హరీశ్‌రావు పేర్కొన్నారు. మూసీ పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టే ప్రయత్నం చేస్తివి. ఆగమాగం, అనాలోచిత నిర్ణయాల వల్ల హైదరాబాద్‌లోని బిల్డర్లలో పాజిటివిటి లోపించింది. రియల్ ఎస్టేట్ ఆగమాగమైపోయింది. రేవంత్ నిర్ణయాల వల్ల పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు భూములు అమ్ముదామంటే కూడా అమ్ముడుపోతలేవు. కేసీఆర్ పాలనలో విదేశాల నుంచే కాకుండా ఉత్తర భారతదేశం వారు పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు హైదరాబాద్ నుంచి పెట్టుబడిదారులు వెళ్తున్నారు అని హరీశ్‌రావు తెలిపారు. రాజకీయాలు, పదవులు శాశ్వతం కాదు.. ప్రజల ప్రాణాలు ముఖ్యం. వేణుగోపాల్ రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. రియల్ ఎస్టేట్ రంగం పూర్వవైభవం పొందే విధంగా ప్రభుత్వం చొరవచూపాలి. ఆయన కుటుంబ సభ్యుల మాటలు వింటుంటే.. మూడు నాలుగు నెలల నుంచి ఎంతో క్షోభ అనుభవించినట్లు తెలుస్తుంది. ఎల్ఐసీలో ఉన్న రూ. 18 లక్షలు తీసుకొచ్చి అప్పులు కట్టి చనిపోయాడు.

ఒక నిజాయితీ పరుడు. ఆత్మగౌరవం కలిగిన వాడు కనుక అవమానం పాలు కావొద్దు అని అప్పుల వారికి అప్పులు కట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య పరిష్కారం కాదు.. కుటుంబ సభ్యులను బాధ పెడుతాయి.. ధైర్యంగా ఎదుర్కోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాల వల్లే చివరకు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చింది. ఆ కుటుంబానికి అండగా నిలబడి పార్టీ తరపున సహాయం అందిస్తాం. అసోసియేషన్లు ముందుకు వచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలి అని హరీశ్‌రావు కోరారు. హైడ్రా పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశావు. విదేశాల్లో ఉన్న వారు ఇక్కడ ఇండ్లు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. ఎందుకంటే హైడ్రాకు భయపడుతున్నారు. పెట్టుబడులు పెట్టేందుకు కూడా భయపడుతున్నారు. వేణుగోపాల్ రెడ్డి లాంటి చిన్న బిల్డర్లు.. ప్రభుత్వాన్ని గ్రాంట్, అప్పు అడగకుండా తాము బతుకుతూ పది మందిని బతికిస్తున్నారు. హైడ్రా పేరుతో పర్మిషన్లు ఉన్న ఇండ్లను కూలగొడితివి. కోర్టు మొట్టికాయలు వేయడంతో పర్మిషన్ల ఇండ్ల జోలికి వెళ్లడం లేదు అని ప్రకటన చేస్తివి. మరి కూలగొట్టిన ఇండ్ల సంగతి ఏంది..? అని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు ప్రశ్నించారు.

కాగా తాను నిర్మించిన అపార్టుమెంట్‌లోని ఫ్లాట్లు అమ్ముడుపోక ఆత్మహత్య చేసుకున్న మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కొంపల్లికి చెందిన బిల్డర్ ముత్యాల వేణుగోపాల్‌రెడ్డి సోదరి కవిత రోదన ఇది. భార్య, పదేండ్ల కుమార్తెతో పాటు తల్లిదండ్రుల ఆలనాపాలనా చూసుకోవడమే కాకుండా ఇద్దరు చెల్లెళ్ల కుటుంబాలకు కూడా చేదోడువాదోడుగా నిలిచే వేణుగోపాల్‌రెడ్డి ఆర్థిక సమస్యలతో కలతచెంది నాలుగు పదుల వయసు దాటకుండానే అర్థాంతరంగా తనువు చాలించడం కలచివేసింది. తన అన్న రియల్ ఎస్టేట్ రంగంలో రాణిస్తూ ఎంత సంతోషంగా ఉండేవాడో%®% కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన హైడ్రా కారణంగా రియల్ రంగం ఎలా దెబ్బతిన్నదో.. చివరకు బ్యాంకులు బిల్డర్లకు రుణాలు ఇవ్వకుండా తీసుకున్న నిర్ణయం తమ కుటుంబాలను ఎంత మానసిక క్షోభకు గురి చేశాయనే వివరాలను కవిత కన్నీరుమున్నీరవుతూ వెల్లడించడం అందరినీ కంటతడి పెట్టిస్తున్నది. నేను ఒకటనుకుంటే ఒకటైంది.. లోన్ రాలేదని అందరికీ అప్పులు నేనెట్ల కడత వేణుగోపాల్‌రెడ్డి సోదరి కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మా అన్న ఐదారు నెలలుగా బాధపడుతుండు. ఆ్రెడీ ఇంట్లో ఉన్నయన్నీ పెట్టేసిన.. అమ్మానాన్నలకు ఖర్చులకు ఇయ్యడానికి లేవని మదనపడ్డడు. అడగకముందే మాకు అన్నీ ఇచ్చెటోడు. ఐదు నెలలు ఎంత ఇబ్బంది పడ్డాడో చూశా. ఎప్పుడు రాఖీ కట్టినా జేబులో ఎంత ఉంటే అంత ఇచ్చెటోడు. మొన్న వెయ్యి రూపాయలు తీసి ఇస్తుంటే ముఖమంత ఎట్లనో పెట్టుకున్నడు. 'ఏమైందన్నా.. అందరికీ సమస్యలొస్తే నువ్వున్నవు. వెయ్యి రూపాయలు కట్నం పెడితే ఇంత బాధపడుతున్నవు. అసలు ఏంటిదన్న ఇబ్బంది.. ' అని చాలాసార్లు అడిగిన. ఏం లేదే.. ఏం కాదు.. అయిపోతది అన్నడు. మేమందరం అడిగినం.. ఏందన్నా డిప్రెషన్లకు ఎందుకెళ్లిపోతున్నవు? అందరం ఉన్నం కదా%® % ఎవరికి ఇచ్చేదుంది? కూర్చుని మాట్లాడదామన్నం. నా సమస్యను నేనే పరిష్కరించుకుంట అన్నడు. సరే.. అది (భవన నిర్మాణం) అయిపోయేందుకు ఎంత కావాలి? అని అడిగి అక్క సాయం చేసింది. బ్యాంకు లోన్‌కు ఐప్లై చేశాడు. కానీ, రాలేదు. 'బిల్డర్ ప్రొఫైల్ ఈజ్ నెగెటివ్' అని వచ్చింది. నెగెటివ్ ఎందుకు వచ్చింది? సిబిల్ .. అన్నీ బాగానే ఉన్నాయి కదా అని బ్యాంకుకెళ్లి అడిగిండు. కొత్తగా వచ్చిన గవర్నమెంట్ వల్ల బిల్డర్లకు లోన్లు ఇస్తే చాలా ప్రాబ్లం అవుతుందని బ్యాంకు వాళ్లు అన్నరు. రిజిస్ట్రేషన్ మార్చి అన్న భార్య ప్రణయ పేరు మీద ఐప్లై చేస్తమన్నడు. కో అప్లికెంట్ బిల్డరే ఉంటడు కదా.. ఇయ్యమన్నరు. వెంటనే ఈ నిర్ణయం (ఆత్మహత్య) తీసుకున్నడు. సీఎం రేవంత్‌రెడ్డి, హన్మంతరావు, డీఐజీ వీళ్లందరికీ 8 లేఖలు రాసిండు. అన్నయ్యే లేకపోతే మేం లేనట్టే!' అని చెబుతూ కన్నీటి పర్యంతమయ్యారు. కాగా డీఐజీకి లేఖ రాసిన లేఖలో.. 'రేవంత్‌రెడ్డి గారూ%®% మీరంటే చాలా గౌరవం. ఓటేసినవారిలో నేనూ ఒకడినండి. మీరు గెలిచారంటే చాలా సంతోషపడ్డాను. హైడ్రాతీసుకువచ్చారు. హైడ్రా వల్ల ఎంత మంది నష్టపోతున్నారో మీరు చూసుకోలేకపోయారు. మీరు ఒక ప్రోగాం స్టార్ట్ చేశారు.. మంచిదే, చెడ్డదని నేను అంటలేను. కానీ, మాలాంటి చిన్న బిల్డర్ల పరిస్థితి ఏంటనేది మీరు ఆలోచించారా? మేమేలా పైకి వస్తారనుకున్నారు? నా చావుకు మీరు కూడా ఒక కారణం' అని రాసిండు.హన్మంతరావుకు ఓ లేఖ రాశాడు%®% 'నేను నీ నియోజకవర్గానికి చెందినవాడిని. మీకు ఓటేసేవాడిలో నేనూ ఒకడిని. మా అమ్మానాన్నలకు బ్యాక్‌గ్రౌండ్ లేదు. వాళ్లకు కొంచెం మీరు సాయం చేయండి. నేను మధ్యలో ఆపేసిన బిల్డింగ్ నిర్మాణ పనులు మళ్లీ స్టార్ట్ అయ్యేలా చూడండి' అని రాసిండు. 'అతి కష్టం మీద మేం బ్యాంకుల్లో లోన్లు తీసుకుంటం. వేధింపుల వల్ల మాలాంటి వాళ్లు కష్టాల నుంచి బయటపడట్లేదు. నేను ఈరోజు చచ్చిపోతున్నా. నాలాంటి వాళ్లు ఇంకా ఎంతోమంది ఉన్నరు. వాళ్లనైనా ఆదుకోండి' అని కోరాడు

# సమావేశమైన మాట వాస్తవమే

## సమావేశంలో రహస్యం అంటూ ఏమీలేదు

## నియోజకవర్గాల అభివృద్ధిపైనే చర్చ జరిగింది

## జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వివరణ

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు పదిమంది రహస్యంగా సమావేశమయ్యారనే వార్త శనివారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ సమావేశానికి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి నాయకత్వం వహించారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పందించారు. 'ఎమ్మెల్యేలం సమావేశమైన మాట వాస్తవమే కానీ అందులో రహస్యం ఏమీ లేదు' అని వివరణ ఇచ్చారు. రహస్యంగా భేటీ కావాల్సిన అవసరమూ తమకు లేదని స్పష్టం చేశారు. ఈమేరకు ఆదివారం ఓ మీడియా సంస్థతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన వ్యక్తిత్వాన్ని తప్పుగా చూపిస్తే ఊరుకోబోనని హెచ్చరించారు. రెవెన్యూ మంత్రి వద్ద తాను ఏ ఫైలు కూడా పెట్టలేదని తేల్చిచెప్పారు. నేను పెట్టానని చెబుతున్న ఫైల్ ఏంటో ఆయనే (నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవి) చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గాల అభివృద్ధిపై ఎమ్మెల్యేలు కలిసి మాట్లాడుకుంటే తప్పేముందని అనిరుధ్ రెడ్డి ప్రశ్నించారు. అయితే, పార్టీ అధిష్ఠానానికి చెప్పాల్సింది చాలానే ఉందని వ్యాఖ్యానించారు. త్వరలో పార్టీ రాష్ట్ర ఇన్ చార్జి దీపాదాస్ మున్షిని కలిసి అన్ని విషయాలు మాట్లాడతానని వివరించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా మరో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖాస్త్రం సంధించారు. తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తాను ఎలాంటి భేటీలో పాల్గొన లేదని ముఖ్యమంత్రికి లేఖ రాసిన నాయిని రాజేందర్ రెడ్డి వివరణ ఇచ్చుకున్నారు. ప్రభుత్వంపై బురదజల్లే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. తనపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్య తీసుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. వారిపై పరువు నష్టం దావా వేస్తానని చట్టపరంగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పది మంది ఎమ్మెల్యేలు రహస్యంగా భేటీ అయ్యారు. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి నివాసంలో భేటీ అయి కేబినెట్‌లోని ఒక మంత్రి వ్యవహారశైలి పైన చర్చించినట్లుగా ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే ఆ మంత్రి పైన పలువురు ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లుగా ప్రచారం జరిగింది. అయితే ఆ ఎమ్మెల్యేల రహస్య భేటీ కాంగ్రెస్ పార్టీలో కలకలం రేపింది.. రకరకాల ప్రచారం జరిగింది. అందులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే అధిష్టానం దూతలు ఆయనతో ఫోన్‌లో సంప్రదించినట్లుగా సమాచారం.. తాను ఎక్కడికి వెళ్లలేదని, ఆ భేటీ గురించి తనకు తెలియదని స్పష్టం చేసిన నాయిని, ముఖ్యమంత్రి కి ఫిర్యాదు చేయడానికి సిద్ధమయ్యారు.తాను ఎవరితో భేటీలో పాల్గొనలేదని సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసిన నాయిని రాజేందర్ రెడ్డి.. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. సీఎంను కలిసి పిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఉద్దేశ పూర్వకంగా ప్రభుత్వ పై కుట్ర జరుగుతుందని ఆరోపించారు. తనపై తప్పుడు ప్రచారాలు చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని నాయిని రాజేందర్ రెడ్డి కోరారు. తనపై తప్పుడు ప్రచారం చేసిన వారిపై పరువు నష్టం దావా వేస్తానని లేఖలో పేర్కొన్న నాయిని రాజేందర్ రెడ్డి ఈ కుట్రల వెనుక ఎవరు ఉన్నా వదిలే ప్రసక్తేలేదని హెచ్చరించారు. సోషల్ మీడియా కుట్రలు, యూట్యూబర్స్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోబోతున్నానని తెలిపారు. ఒకవేళ సొంత పార్టీ ఎమ్మెల్యేలు స్వంత పార్టీ ఎమ్మెల్యేలు నలుగురు కూర్చొని అబివృద్ధిపై చర్చిస్తే తప్పేముందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి తో చర్చించిన అనంతరం తనపై తప్పుడు ప్రచారాలు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు



తీసుకుంటారని నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటించారు. తాజా వ్యవహారంపై వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రియాక్ట్ అయ్యారు. మీడియా అంటే ప్రత్యేక గౌరవం ఉందని.. వక్రీకరించి వార్తలు ప్రసారం చేయడం సరికాదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇటీవల జరిగిన ఓ రహస్య సమావేశంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పాల్గొన్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. దీనిపై ఎమ్మెల్యే స్పందించారు. తాను ఎలాంటి రహస్య సమావేశంలో పాల్గొనలేదని.. అయినప్పటికీ తాను కూడా మీటింగ్‌లో పాల్గొన్నట్లు ప్రచారం చేయడం సరైన చర్య కాదని అన్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ సృష్టించిన ఒక ఫేక్ వార్తను కొన్ని మీడియా ఛానెళ్లు నిజానిజాలు తెలుసుకోకుండా ప్రచారం చేయడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. మీడియా అంటే ఎంతో గౌరవం ఉందని ఇలాంటి తప్పుడు ఆరోపణల కథనాలను ప్రసారం చేసి మీడియాపై ఉన్న గౌరవాన్ని దిగజార్చుకోకూడదని ఆయన తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిధుల కేటాయింపులో తమకు అన్యాయం చేస్తోందని కొంతమంది ఎమ్మెల్యేలు వాపోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మంత్రులు ఉన్న నియోజకవర్గాలకే నిధులు వెళుతున్నాయి తప్ప తమ నియోజకవర్గాలకు రావడంలేదని మండిపడుతున్నట్లు సమాచారం. ఇదే విషయంపై ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు రహస్యంగా భేటీ అయినట్లు వార్తలు వినిపించాయి. దీంతో అప్రమత్తమైన టీపీసీసీ సారథి మహేశ్ కుమార్ గౌడ్.. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి ఫోన్ చేశారని, అది కేవలం లంచ్ మీటింగ్ మాత్రమేనని అనిరుధ్ రెడ్డి వివరణ ఇచ్చారని పార్టీ వర్గాల సమాచారం.

## కాంగోలో సైన్యానికి, రెబల్స్‌కు మధ్య భీకర యుద్ధం

మొదటిపేజీ తరువాయి..

రెబల్స్.. మరిన్ని ప్రాంతాలను హస్తగతం చేసుకునేందుకు ముందుకు సాగుతున్నారు. అయితే, వారి నుంచి సైన్యం కొన్ని ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకుంది. వారం రోజులుగా జరుగుతున్న పోరులో 773 మంది మృతి చెందగా, 2,880 మంది గాయపడినట్టు ప్రభుత్వ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. క్షతగాత్రులకు సమీపంలోని ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. గోమా తిరుగుబాటు దారుల వశం కావడంతో ప్రజలు వేలాదిగా నగరాన్ని వదిలిపెడుతున్నారు. అయితే, విద్యుత్తు సరఫరాతోపాటు ప్రాథమిక సేవలను పునరుద్ధరిస్తామని తిరుగుబాటుదారులు హామీ ఇవ్వడంతో ప్రజలు తిరిగి గోమాకు చేరుకుంటున్నారు. చెత్తాచెదారం, రక్తం, దుర్వాసనతో నిండిపోయిన పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. తనకు ఇప్పుడు ఎటు వెళ్లాలో అర్థం కావడం లేదని, ప్రతి మూలలో ఏదో ఒక దుఃఖం ఉందని పోరాటంలో మరణించిన వారి బంధువు ఒకరు తెలిపారు. కాంగోలోని తూర్పుప్రాంత్రం ఖనిజ సంపదతో నిండి ఉంది. ఇక్కడ విస్తారమైన ఖనిజ నిక్షేపాలున్నాయి. దీంతో ఆ ప్రాంతంపై నియంత్రణ కోసం 100 కంటే ఎక్కువ సాయుధ సమూహాలు పోటీపడుతున్నాయి. వాటిలో 'ఎం23' అనేది ఒకటి. దీనికి పొరుగున ఉన్న రువాండా మద్దతు ఇస్తోంది. దాదాపు 4 వేల మంది సైనికులు దానికి మద్దతుగా ఉన్నారు. 2012లో 'ఎం23' తొలిసారి గోమాను స్వాధీనం చేసుకుంది.



## అమెరికా దిగుమతులపై 25 శాతం సుంకం

మొదటిపేజీ తరువాయి..

నాయకులు సిద్ధమయ్యారు. ముఖ్యంగా కెనెడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో.. ట్రంప్‌నకు వేగంగా కౌంటర్ ఇచ్చారు. ఇందులో భాగంగానే తాము కూడా ప్రతిచర్యగా అమెరికా నుంచి కెనెడా వచ్చే దిగుమతులపై తాము సుంకాలు పెంచుతున్నట్లు ప్రకటించారు. 155 బిలియన్ కెనడియన్ డాలర్ల విలువైన అమెరికా దిగుమతులపై 25 శాతం



సుంకం విధిస్తున్నట్లు ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రకటించారు. మెక్సికో కూడా ఇలాంటి ఆదేశాలే జారీ చేసింది. ఈ రోజు మెక్సికో, కెనెడా దిగుమతులపై 25 శాతం, చైనా దిగుమతి వస్తువులపై 10 శాతం సుంకాలు విధిస్తూ ఉత్తర్వులపై సంతకం చేశాను. ఫెంటనిల్ తో సహా అమెరికా పౌరులను చంపే ప్రాణాంతకమైన, చట్టవిరుద్ధమైన మాదక ద్రవ్యాల ముప్పు కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నాం. అమెరికన్లను రక్షించాల్సిన బాధ్యత మాపై ఉంది. అందరికీ భద్రత కల్పించడం దేశ అధ్యక్షుడిగా నా బాధ్యత. చట్టవిరుద్ధ వలసదారులు, మాదక ద్రవ్యాలు మా సరిహద్దుల్లోకి రాకుండా చేస్తానని ఎన్నికల ప్రచారంలో మాటిచ్చాను. ఆ మాటకు కట్టుబడి పనిచేస్తున్నాను." అని తన సొంత సోషల్ మీడియా ట్రూత్ సోషల్ లో ఓ పోస్టులో పేర్కొన్నారు. "155 బిలియన్ కెనడియన్ డాలర్ల అమెరికా దిగుమతులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తున్నాం. వాషింగ్టన్ చర్యలకు ఇది కెనెడా ప్రతిస్పందన. ఈ మొత్తంలో 30 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతి వస్తువులపై విధించే సుంకం మంగళవారం నుంచి అమల్లోకి వస్తుంది. మిగిలినవి 21 రోజుల తర్వాత అమలవుతాయి. అమెరికాను స్వర్ణయుగంలా మార్చాలని అధ్యక్షుడు ట్రంప్ అనుకుంటే.. మాతో భాగస్వామ్యాన్ని కోరుకోవాలి. అదే వారికి మంచిది," అని ట్రూడో పేర్కొన్నారు.మరోవైపు, మెక్సికో కూడా కెనెడా బాటలోనే నడిచింది. తాము కూడా అమెరికా దిగుమతులపై టారిఫ్‌లు విధిస్తామని ఆ దేశ అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ పేర్కొన్నారు. "డ్రగ్స్ అక్రమ రవాణా గ్రూపులతో తమ ప్రభుత్వానికి సంబంధాలు ఉన్నాయంటూ అమెరికా చేసిన ఆరోపణలను ఖండిస్తున్నాను. మా ప్రభుత్వం నాలుగు నెలల్లో 20 మిలియన్ డోస్ ఫెంటనిల్ సహా 40 టన్నులకు పైగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంది. పదివేల మందిని అరెస్టు చేశాం. మెక్సికో పొరుగు దేశాలతో సహకారం కోరుకుంటుంది తప్ప.. ఘర్షణ కాదు. మాదకద్రవ్యాలను అరికట్టాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించుకుంటే.. అందుకు కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాం. టారిఫ్‌లు విధిస్తే సమస్యలు పరిష్కారం కావు. మెక్సికన్ల ప్రయోజనాలకు అనుగుణంగా మేము చర్యలు తీసుకుంటాం. ఆర్థిక కార్యదర్శిని ప్లాన్ బీ అమలు చేయాలని ఆదేశించాను," అని షేన్‌బామ్ ఎక్స్‌లో రాసుకున్నారు. ఇక చైనా మాత్రం సమయం చూసి సమాధానం చెబుతామని, ప్రపంచ వాణిజ్య సంస్థ లో ట్రంప్ నిర్ణయాలకు వ్యతిరేకంగా అప్పీల్ చేస్తామని తెలిపింది. వాణిజ్య పరంగా యుద్ధం చేస్తే.. ఎవరికీ విజయం దక్కదని.. సుంకాలు విధిస్తే ఇరు దేశాల సంబంధాలు దెబ్బతింటాయిన చైనా విదేశాంగ మంత్రి చెప్పారు. ఏదైనా సమస్యలుంటే దీనిపై చర్చలతో పరిష్కరించుకోవాలని సూచించారు.

## త్వరలోనే పంచాయతీ ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి..



సన్నద్ధంగా ఉన్నామంటూ పంచాయతీరాజ్, ఎన్నికల సంఘం అధికారులు సీఎంకు చెప్పినట్లు తెలుస్తోంది. అటు, కులగణనపై నివేదిక కేబినెట్ సబ్ కమిటీకి ఆదివారం అందింది. దీనిపై కేబినెట్‌లో చర్చించాక.. 5వ తేదీన అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై తీర్మానం చేసి.. కేంద్ర ప్రభుత్వానికి పంపే వీలుంది. అయితే, కేంద్రం స్పందన ఏమైనా.. రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకుని.. ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చి మొదటి వారంలో గ్రామ పంచాయతీల ఎన్నికలకు వెళ్లాలనే కార్యాచరణతో సర్కారు ఉన్నట్లు సమాచారం.

# క్రైమ్ మిర్రర్ వీరగాథ సమాప్తం



* చేసిన మిర్యాలగూడ పోలీసులు
* ప్రభుత్వ అధికారులే టార్గెట్ చేసి డబ్బులు డిమాండ్
* చేసిన ముఠా అరెస్ట్

**మిర్యాలగూడ సాక్ష్యం ఫిబ్రవరి02:** నల్గొండ జిల్లా వ్యాప్తంగా క్రైమ్ మిర్రర్ డిజిటల్ పత్రిక అని చెప్పుకుంటూ ప్రభుత్వ అధికారులను బెదిరిస్తూ వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ముఠా ను అరెస్ట్ చేసినట్లు మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో తెలిపారు. మిర్యాలగూడ టూ టౌన్ లో మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. నల్గొండకు చెందిన ఆనంద్ కుమార్ బ్యూరో ఎడిటర్, డిజిటల్ పత్రిక మరియు తుప్పూరి రఘు వట్టిపల్లి గ్రామం మర్రిగూడ మండలం మరియు పేరబోయిన ఆంజనేయులుమాడుగుల పల్లి మండలం పాముల పాడుగ్రామానికి చెందిన వీరు జిల్లా వ్యాప్తంగా క్రైమ్ మిర్రర్ అనే డిజిటల్ పత్రిక ను నడుపుతున్నామని ప్రచారం చేసుకుంటూ ప్రభుత్వ అధికారులను బెదిరిస్తూ వారిపై వార్తలను ప్రచురిస్తూ వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు పై కూడా ఇదేవిధంగా తమ పత్రికలో ప్రచురించి దీని కొనసాగింపు ఉంటుందని మీరు డబ్బులు ఇవ్వండి లేని పక్షంలో మరల వార్త ప్రచురిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు
వారు ఒత్తిడి తట్టుకోలేక జనవరి 24 న సీఐ వీరబాబు వారు స్నేహితుడి ఇంటి వద్ద ఒక లక్ష పదివేల రూపాయలు నగదును పేరబోయిన ఆంజనేయులుకు ఇచ్చినాడు వారు మాట్లాడుకున్నలో ఐదు లక్షల్లో భాగంగా ఒక లక్ష పదివేల మాత్రమే ఇచ్చారనీ మిగతా డబ్బులు ఇవ్వాలని సిఐను నెల రోజులుగా ఒత్తిడి గురి చేస్తున్నట్టు ఒక దశలో సీఐ మానసికంగా ఆందోళన చెందినారని డిఎస్పి చెప్పారు. పేరబోయిన ఆంజనేయులు కు ఇచ్చిన 1,10,000/ రూపాయల డబ్బుల్లో 10000/ ఆయన ఉంచుకొని మిగతా డబ్బులు ను రఘుకు ఫోన్పే ద్వారా పంపించారు. రఘు పదిహేను వేల రూపాయలు తన వద్ద ఉంచుకుని మిగతా 85000 రూపాయలను బ్యూరో ఎడిటర్ క్రైమ్ మిర్రర్ ఆనంద్ కుమార్ కు నల్లగొండలోని ఏటీఎం ద్వారా పంపించారు. ఇలా వీరిపై కంప్లైంట్ రావడంతో నలగొండ ఎస్పీ ఆదేశాను సారం మిర్యాలగూడ డి.ఎస్.పి కేసు నమోదు చేసుకొని విచారించగా వీరి లో రఘు, ఆంజనేయులు లను అరెస్ట్ చేశారు. ఆనంద్ కుమార్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వీరు గతంలో నాగార్జునసాగర్ లోనీ అటవీశాఖ అధికారి పై నెల రోజులుగా వార్తలు ప్రచురిస్తూ వారి నుంచి 50 వేల రూపాయలు చేసినట్టు బాధితుడు ఫిర్యాదు మేరకు సాగర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయినట్టు వివరించారు. గత ఏడాది ఆగస్టు నెలలో సూర్యాపేట అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ హెల్త్ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న వ్యక్తి వద్ద బెదిరింపులకు పాల్పడి వారి వద్ద నుంచి 50 వేల రూపాయలు వసూలు చేసినట్లు ఆఫీసర్ ఫిర్యాదు మేరకు వీరు పై కేసు నమోదు చేసినట్లు వివరించారు. మరో మూడు ఫిర్యాదులు కూడా వచ్చాయని వాటిపై విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని చెప్పారు. విలేకరుల సమావేశంలో మిర్యాలగూడ టూ టౌన్ సిఐ నాగార్జున పాల్గొన్నారు.

## నూతన క్యాలెండర్ (2025) ఆవిష్కరణ



### కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి రామచంద్రం ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ

**బ్యూరో చీఫ్ వరంగల్ ఫిబ్రవరి 2:** ప్రతి అక్షరం ప్రజా సమస్యల పరిష్కార కోసమే యామ్స్ పెన్ ఎడిటర్ యాంసాని శ్రీనివాస్ 39 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం.. నిష్పక్షపాతి,నిబద్ధతకు నిలువెత్తు సాక్ష్యం.. ఒకేసారి తెలుగు ఇంగ్లీషులో క్యాలెండర్ ఆవిష్కరణ అభినందనీయం..యాంసాని శ్రీనివాస్ ను.. అభినందించిన కేయూ రిజిస్టరర్ వి రాంచంద్రం పత్రికా రంగంలో 39 సంవత్స రాల సుదీర్ఘ అనుభవం కలిగిన సీనియర్ జర్నలిస్ట్ గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ యాంసాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన దినపత్రిక యామ్స్ పెన్ తెలుగు,ఇంగ్లీష్ భాషలలో రూపుదిద్దుకున్న సందర్భంగా దినపత్రిక 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి రామచంద్రం ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వి రామచంద్రం మాట్లాడు తూ.., జర్నలిస్టు వృత్తిలో సుదీర్ఘ అనుభవం కలిగిన యాంసాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూపు దిద్దుకుంటున్న యమ్స్ పెన్ దినపత్రిక ఏకకాలంలో తెలుగు ఇంగ్లీష్ భాషలలో రావడం సంతోష దాయకమన్నారు అనతి కాలంలోనే ప్రజాదారణ పొంది అంచలంచెలుగా ఎదగాలని వారు ఆకాంక్షించారు.అనంతరం ఎన్ ఎస్ రావు మాట్లాడుతూ యాంసాని శ్రీనివాస్ సారథ్యంలో ఏకకాలంలో తెలుగు ఇంగ్లీషులో వెలుపడుతున్న దినపత్రిక ప్రజల ముందుకు రావడం సంతోషకర విషయం అన్నారు.పోటీ ప్రపంచంలో శాస్త్ర సాంకేతిక రంగంలో అభివృద్ధి చెందుతున్న తరుణంలో పత్రికా రంగం ఎంతో విస్తరించిందన్నారు. ఈ సందర్భంగా యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. పులి శరత్ కుమార్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల సమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభించకపోవడం తద్వారా వివిధ దశల్లో తిరిగి ఉత్పన్నం కావడం శోచనీయం అలాంటి సందర్భంలో పత్రికల ద్వారా ప్రచురితమయ్యే అన్ని రకాల సమస్యలను ప్రభుత్వము ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. యామ్స్ పెన్ దినపత్రిక నిబద్ధత కలిగిన విలేకరులతో ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేస్తారని,ప్రజా సమస్యలను వెలికి తీసి పరిష్కరించే దిశగా పనిచేస్తారని యాప్స్ పెన్ యాజమాన్యం ధీమా వ్యక్తం చేశారు.అనంతరం పలువురు జర్నలిస్టులు యామ్స్ పెన్ యాజమాన్యాన్ని అభినందించారు.ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్ర మంలో ఎన్ ఎస్ రావు,పులి శరత్ కుమార్,బేర రాజేందర్, రడపాక ప్రదీప్,జంజిరాల శ్రీధర్ సీనియర్ జర్నలిస్టులు యామ్స్ పెన్ అసోసియేట్ ఎడిటర్ కొత్తపల్లి రమేష్,హన్మకొండ రిపోర్టర్లు సమ్మూలాల్ సిద్ధూ,చింత పట్ల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అబాకస్ పరీక్షలో శ్రీ విద్యా విద్యార్థిని సత్తా





స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన శ్రీజ

**సాక్ష్యం (పాపన్న పేటజనవరి 2)** రాష్ట్ర స్థాయి అబాకస్ పరీక్షలో పాపన్న పేట శ్రీ విద్య స్కూల్ విద్యార్థిని ప్రథమ ర్యాంక్ సాధించింది. హైదరాబాద్ లో రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఇందులో 600 పాఠశాలకు చెందిన 780 మంది విద్యార్థులు పోటీ పరీక్షలో పాల్గొన్నారు... స్టార్ జూనియర్ క్యాటగిరిలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి 71 పాఠశాలలు 142 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా శ్రీ విద్యా పాఠశాల విద్యార్థిని శ్రీజ మొదటి ర్యాంక్ సాధించింది. అలాగే జూనియర్ లెవెల్ పరీక్షలో షి జ తనహి, సీనియర్ లెవెల్ లో అష్ట... రాష్ట్ర స్థాయి పరీక్షలో పాల్గొనగా వారు కన్సలేషన్ బహుమతి సాధించారు....రాష్ట్ర స్థాయి లో జరిగిన పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ ర్యాంక్ సాధిం చిన శ్రీజ ను పాఠశాల ప్రినిపల్ రవీందర్ గుప్తా.. కరస్పాండెంట్ నీరలాక్షప్ప, సుమన్, ఉపాధ్యాయురాలు స్రవంతి, ప్రియాంక, దుర్గ, ఉపాధ్యాయ బృందం ను అభినందించారు.

## మోకు దెబ్బ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో మల్లేష్ (సాక్ష్యం న్యూస్ ) :** గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ క్యాలెండర్ ను మహబూబాద్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ అదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా మహబూబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వారసత్వం కొనసాగించాలన్నారు. బహుజనులు అందరూ ఏకమై బహుజన రాజ్యం తేవాలని సూచించారు. అనంతరం మోకు దెబ్బ మహబూబాద్ జిల్లా అధ్యక్షులు ముంజాల రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ గౌడ్ లు ఎస్ సీ , ఎస్ టీ , బీసీ , మైనార్టీ వర్గాలను కలుపుకొని గౌడ్ లు రాజ్యాధికార చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో మోకు దెబ్బ అధికార ప్రతినిధి లింగాల వీరభద్రం గౌడ్ , కార్యదర్శి గడ్డం సమ్మయ్య గౌడ్ , ప్రధాన కార్యదర్శి బూడిగె భద్రసేన గౌడ్ , గౌరవ అధ్యక్షులు మద్యల శ్రీనివాస్ గౌడ్ , వర్కింగ్ ప్రెసిడెంట్ గాడిపెల్లి శేఖర్ గౌడ్, బీసీ రాజ్యాధికార సమితి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు గండి వీరేందర్ గౌడ్ , ప్రధాన కార్యదర్శి కొడుపుగంటి శ్రీధర్ , కాంగ్రెస్ పార్టీ ఎస్ టీ సెల్ స్టేట్ కో అర్డినేటర్ గుగులోత్ వెంకట్ నాయక్ , ఎస్ టీ టౌన్ సెల్ అధ్యక్షులు శంకర్ నాయక్ , రైతు సంఘం జిల్లా అధ్యక్షులు యుగేందర్ , కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షులు సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


## నిరుద్యోగులకు అండగా ఉండేందుకే ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న

* ఉద్యోగ రూపకల్పనలో ముందువరుసలో ఉంటా.
* ప్రైవేటు ఉపాధ్యాయులకు హెల్త్ కార్డుల మంజూరికి కృషి.
* మెదక్ కరీంనగర్ నిజాంబాద్ అదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సద్దాం హుస్సేన్



**సాక్ష్యం న్యూస్ (పాపన్నపేట)** నిరుద్యోగులకు అండగా నిలిచి వారి సమస్యలు పరిష్కరించేందుకే తాను పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నట్టు సద్దాం హుస్సేన్ వెల్లడించారు. పాపన్నపేట మండలంలో పలువురు పట్టభద్రులను కలిసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు పలకాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉద్యోగ, నిరుద్యోగ,పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఒక మంచి ఉద్దేశంతో తాను రాజకీయాల్లోకి వస్తున్నట్టు వెల్లడించారు. నిరుద్యోగులకు అండగా ఉంటూ,ఉద్యోగ రూపకల్పనలో ఉంటానని వెల్లడించారు.ప్రైవేట్ విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రైవేట్ విద్యా సంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు చేదోడు - వాదోడుగా ఉంటూ వారికి ఉద్యోగ భద్రతతో పాటు హెల్త్ కార్డుల మంజూరుకి కృషి చేస్తానని పేర్కొన్నారు.తాను ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత వచ్చే వేతనాన్ని ఒక సంక్షేమ నిధి ఏర్పాటు చేసి నిరుపేద ఉపాధ్యాయులకు, నిరుద్యోగ పట్టబద్రుల సంక్షేమానికి వెచ్చిస్తానని వెల్లడించారు. విద్యారంగంలో అనేక మార్పులు తెచ్చిన తాను రాజకీయ రంగంలో కూడా నూతన ఒరవడి సృష్టిస్తానని వెల్లడించారు. రానున్న పట్టభద్రులు ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## గిరిజన తండాల రోడ్ల పనులను నిలిపివేసిన కాంగ్రెస్



* మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆగ్రహం
* సుమారు 100 కి.మి మేరనిలిచిపోయిన గిరిజన గ్రామాల లింక్ రోడ్లు
* కంకర తెలిన రోడ్లపై గిరిజనులు నడవలేని దుస్థితి



**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో మల్లేష్ ( సాక్ష్యం న్యూస్ ):** గిరిజన తండాల రోడ్ల పనులు రద్దు చేయడం ప్రజాస్వామ్యంలో హేయమైన చర్య అని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మండిపడ్డారు. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం మంగళవారిపేటలోని గిరిజన తండాలకు గ్రామాల లింక్ రోడ్ల దుస్థితిని అదివారం నర్సంపేట మాజీ ఎమ్మె ల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే పెద్ది మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో తాను నర్సంపేట శాసనసభ్యుడిగా ఉన్న సమయంలో నర్సంపేట నియోజకవర్గంలో ఖానాపురం మండలంలో మంగళావారిపేట గిరిజన గ్రామాలతో పాటు ఇతర మండల పరిధిలోని మారుమూల గిరిజన తండాలకు , గ్రామాలకు లింకు రోడ్లను మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. సదరు పనులు బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే టెండర్లు పూర్తి కాగా కంకర పోసి పనులు ప్రారంభించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక నర్సంపేట శాసనసభ్యులు ముందుచూపు లేకుండా ఒక విజన్ అంటూ లేకుండా పనులను రద్దు చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. పనుల నిలుపుదలతో తండాల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలతో గిరిజన గ్రామాల లింక్ రోడ్లు సుమారు 100 కి.మి మేర రోడ్ల పనులు నిలిచిపోవడంతో కంకర తేలి ప్రజలు కనీసం నడవలేని దుస్థితిలో నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కంకర తేలిన రోడ్లతో ప్రమాదాలు జరిగి గాయాల పాలవటం ,మృత్యువాత పడ్డ సంఘటనలు ఇటీవల నియోజకవర్గంలో చూసామన్నారు.అభివృద్ధి అనేది నిరంతరమైందని అలాంటిది రోడ్ల పనులు రద్దు చేయడం ప్రజాస్వామ్యంలో హేయమైన చర్య అని మండిపడ్డారు.పంచాయతీ ఎన్నికల పేర కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాకు తెరలేపిన విషయాన్ని ప్రజలు పసిగట్టారని స్థానిక సంస్థ ఎన్నికలలో కాంగ్రెస్ తగిన గుణపాఠం చెబుతారని విమర్శించారు.
గ్రామాల్లో, తండాల్లో రోడ్ల పనులను రద్దు చేసి ఏ మొహం పెట్టుకుని రేపు గ్రామాల్లో ఓట్లకు వస్తారో గ్రామ ప్రజలే తేల్చుకుంటారన్నారు. రోడ్ల పనులు అర్థాంతరంగా ఆపేసి , నిధులు మళ్ళించి సొంత కాంట్రాక్ట్ పనుల కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు.
గిరిజన గ్రామాల్లోకి వచ్చి ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో పాకాల మున్నేరు వాగు మీద మూడు బ్రిడ్జిలు మంజూరు ఇచ్చి టెండర్లు పూర్తి చేస్తే..
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినాక తట్టెడు మట్టి తీయలేదని దుయ్యబట్టారు.ఈకార్యక్రమంలో బీఆర్ ఎస్ ఖానాపురం మండల పార్టీ అధ్యక్షులు మహలక్ష్మి వెంకటనర్సయ్య ,మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి , మాజీ జెడ్పీటీసీ స్వప్న - బత్తిని శ్రీనివాస్ గౌడ్ , బీఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## క్రికెట్‌లో రాణించి కోదాడకు పేరు తేవాలి





**కోదాడ ఫిబ్రవరి 2( సాక్ష్యం)** కోదాడ పట్టణంలో భారీ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహబూబ్ జానీ, వైస్ చైర్మన్ బషీర్ అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో లగాన్ టీం కోదాడ జూనియర్ క్రికెట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కోదాడ సీనియర్ క్రికెట్ లెజెండ్ పోటీల ప్రారంభం బహుమతి ప్రధానోత్సవాల కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు...క్రీడలు ఐకమత్యానికి, స్నేహభావానికి ప్రతీకలు అన్నారు. క్రికెట్ క్రీడా ప్రతిభావంతంగా ఆడడం అభినందనీయమన్నారు. క్రీడాకారుల్లో స్ఫూర్తిని అభినందించారు. టోర్నమెంట్ కు మొత్తం ఎనిమిది జట్లు రాగా హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో ప్రథమ బహుమతి బి.బి.ఎం.సీ.ఏ టీమ్, ద్వితీయ బహుమతి ఎం.ఎం ఎఫ్.సి తృతీయ బహుమతి సహారా యూత్ జట్లు కైవసం చేసుకున్నాయి. టోర్నమెంట్లో బెస్ట్ బ్యాట్స్మెన్ గా బి బి ఎం సి క్రీడాకారుడు సర్కిల్ ఇన్స్పెక్టర్ గౌస్ అందుకోగా బెస్ట్ బౌలర్గా బిబిఎంసీ క్రీడాకారుడు జాకీర్ షీల్డ్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ నయీమ్, ఆర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గట్ల నరసింహారావు నాయకులు పందితిరపయ్య గంధం పాండు మాజీ కౌన్సిలర్ కాజా ఫయాజ్ భాయ్ నిర్వాహకులు షేక్ దస్తగీర్ అజ్జు , ఆత హర్, మహమూద్ క్రీడాకారులు క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వధూ వరులని ఆశీర్వదించిన బారాస నాయకులు



**సాక్ష్యంన్యూస్ జనవరి2 (దంతాలపల్లి ప్రతినిధి జెల్ల శ్రీనివాస్)** స్థానిక దంతాలపల్లి మండల కేంద్రములోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో కుమ్మరి కుంట్ల గ్రామానికి చెందిన కొంపల్లి లింగయ్య కుమారుడు కొంపల్లి ప్రవీణ్, కన్నా నర్సయ్య కుమార్తె ప్రవళికల వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బారాస నాయకులు ఓలాద్రి మల్లారెడ్డి,తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రచార కార్యదర్శి దుండి వెంకటేశ్వర్లు,
బారాస పార్టీ సోషల్ మీడియా మండల అధ్యక్షులు చిల్లా రామకృష్ణ,పోలోజు కృష్ణ, వల్లపు కృష్ణ,కన్నా వెంకన్న,అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పార్టీలో చేరిన బిఆర్‌ఎస్ నాయకులు

* మైనంపల్లి హన్మంత రావు సమక్షంలో పార్టీలో చేరికలు
* ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ పాలనను చూసి బిఆర్ఎస్ పార్టీని వీడినం



**మెదక్ జిల్లా ప్రతినిధి 2 ఫిబ్రవరి సాక్ష్యం:** మెదక్ నియోజకవర్గంలోని రామాయంపేట మండలం లోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, కౌన్సిలర్ గజవాడ నాగరాజు, చింతల యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ నాగేశ్వర్ రెడ్డి, నాయకులు మధునాల స్వామి గౌడ్, యాద నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోనాల శ్రీను, మేస్త్రి యూనియన్ అధ్యక్షులు మర్కు చంద్రం లు ఆదివారం మైనంపల్లి హన్మంత రావు సమక్షం లో దూలపల్లి నివాసం లో కాంగ్రెస్ పార్టీ కండువా ను కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.

## హరివర్ధన్ గౌడ్‌ని అభినందించిన ప్రముఖులు



**దేవరకొండ: సాక్ష్యం న్యూస్:** ఫిబ్రవరి 2 విశాఖపట్నంలో జరిగిన నేషనల్ కరాటే పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన దేవరకొండ మున్సిపాలిటీ 18 వ వార్డు మాజీ కౌన్సిలర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వీరమెని అంజి గౌడ్ తనయుడు హరివర్ధన్ గౌడ్ ని పలువురు ప్రముఖులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. మరిన్ని మెడల్స్ పొందాలని వారు అన్నారు. అభినందించిన వారిలో బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,మాజీ శాసన దేవరకొండ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ , బిఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు , బిఆర్ఎస్వి దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ , బీసీ సంఘం రాష్ట్ర నాయకులు మహేష్ గౌడ్ ,బిఆర్ఎస్వీ మండల అధ్యక్షులు లక్ష్మణ్, బిఆర్ఎస్ పట్టణ యువజన విభాగం అధ్యక్షులు పొట్ట మధు, ముదిగొండ హరిదాస్,18వ వార్డు వాసులు తదితరులు ఉన్నారు.

## బిసి పొలిటికల్ యువజన జేఏసీ క్యాలెండర్ 2025 ఆవిష్కరణ కార్యక్రమం

**దేవరకొండ: సాక్ష్యం న్యూస్:** ఫిబ్రవరి 2: దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నందు ముఖ్యఅతిథిగా బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ బిసి పొలిటికల్ యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి సతీష్ గౌడ్ నారమోని హరీష్ యాదవ్ మండల అధ్యక్షుడు , ప్రధాన కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది మండల అధ్యక్షులు హరీష్ యాదవ్ మాట్లాడుతూ బీసీలు పొలిటికల్‌గా ఎదగాలని కలిసికట్టుగా ఉండి రాజ్యాధికారం చేపట్టాలని కోరారు.



## ఉత్తమ అధికారిని సన్మానించిన ఐఎన్టియు సి



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి,( ఫిబ్రవరి 02); మణుగూరు ఏరియా ఉత్తమ అధికారి డీజీఎం పర్సనల్ సలగల రమేష్ ను ఆదివారం ఐఎన్టియుసి మణుగూరు ఏరియా ఉపాధ్యక్షులు వత్సవాయి కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మణుగూరు ఏరియా ఉత్తమ అధికారిగా ఎంపికైన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగిందన్నారు.మాట కఠినమైన మనసు సున్నితమని మణుగూరు ఏరియా కార్మికుల సంక్షేమానికి సంబంధించి కార్మిక సంఘాల విజ్ఞప్తులను యాజమాన్యం దృష్టికి తీసుకుని వెళ్లి అవి పరిష్కరించే దిశగా ప్రయత్నించే వ్యక్తులలో ముందు వరుసలో ఉంటారని అన్నారు.వారి సేవలను నిజాయితీ నిబద్ధతలను వారు కొనియాడారు. ఉద్యోగపరంలో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఏరియా ప్రధాన కార్యదర్శి సిల్వేరు గట్టయ్య మాట్లాడుతూ ఉత్తమ అధికారిక ఎంపికైన స్ఫూర్తితో సింగరేణి యాజమాన్యం నుండి ఏరియా కార్మిక వర్గానికి మరిన్ని సంక్షేమ ఫలాలు అదే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ రవూఫ్, ఎండి షాబుద్దీన్, భానోత్ కృష్ణ, బుర్రా వెంకటేశ్వర్లు, మల్లికార్జున్, రామారావు, సిహెచ్ అశోక్, అజిత్,తిరుపతి,చిలుముల శ్రీనివాస్, తదితరులు, పాల్గొన్నారు.

## హలో మాదిగ ఛలో హైదరాబాద్ గోడ ప్రతులు ఆవిష్కరణ



వేములవాడ, ఫిబ్రవరి 02, (సాక్ష్యం): ఈ నెల 07న హైదరాబాద్ లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని తలపెట్టిన హలో మాదిగ ఛలో హైదరాబాద్ గోడ ప్రతులను మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు జింక శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆవునూరి ప్రభాకర్, ఎఎస్పీ జిల్లా అధ్యక్షులు ఖానాపురం లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ యెలగంధుల బిక్షపతి, జిల్లా కో కన్వీనర్ లు సావనపెల్లి రాకేష్, దొబ్బల ఆనంద్, వేములవాడ మండల ప్రధాన కార్యదర్శి, దోమకొండ మహేందర్, ఆయా గ్రామాల అధ్యక్షులు గుడిసె మనోజ్ కుమార్, బండ మహేందర్, సంధ్యల సత్తయ్య, రోమాల రవి, సామల్ల ప్రతాప్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## వేల గొంతులు లక్షల డప్పులు వాల్ పోస్టర్ ఆవిష్కరణ



* ఈనెల 7న జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
* ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండ థామస్

సుల్తానాబాద్, ఫిబ్రవరి 02,(సాక్ష్యం): సుల్తానాబాద్ లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండ థామస్ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్ లో జరిగే వేల గొంతులు లక్షల డప్పులు వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు.థామస్ మాదిగ మాట్లాడుతూ.... ఎస్సీ వర్గీకరణ అమలుకై లక్షల డప్పుల వేల గొంతులు మాదిగల భారీ సంస్కృతిక ప్రదర్శన ఉదయం 11గంటలకు ర్యాలీ ప్రారంభమై ఎల్బి స్టేడియం నుండి పెద్ద అంబేద్కర్ విగ్రహం వరకు ఇట్టి ప్రదర్శన విజయవంతం చేయుట కొరకు తెలంగాణ రాష్ట్రం నుండి మాదిగ ఉపకులాలు, మాదిగ కుల బంధువులు ఇంటికో డప్పు తీసుకొని మన హక్కుల కొరకు మన ఆత్మగౌరవం కొరకు మన ఆశయ సాధన కొరకు 30 సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్న ఎస్సీ వర్గీకరణ కల నెరవేరడం కొరకు లక్షలాది డప్పులు కొడుతూ హైదరాబాదు లో మాదిగల సత్తా ఏంటో చూపెట్టే రోజు వచ్చిందని,కాబట్టి లక్షలాదిగా డప్పు కళా నాయకులు తరలిరావాలని థామస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు తిప్పారపు లక్ష్మణ్,ఎం ఎస్ పి మండల అధ్యక్షులు కనకం శంకర్,సీనియర్ నాయకులు క్యా దాసి చంద్రమౌళి, ఎనగందుల నాంపల్లి,దాసరి సంపత్, ఆరేపల్లి రాహుల్, మాణిక్ బాయ్, రాములు,అంజయ్య,చంద్రయ్య కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాసర క్షేత్ర యాత్ర




కరీంనగర్, ఫిబ్రవరి 02,( సాక్ష్యం ) : కరీంనగర్ జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు తేదీ 02-02-2025 రోజున సరస్వతి దేవాలయం బాసర క్షేత్రమునకు సందర్శనార్థం, విజ్ఞాన విహారయాత్రకు ఉదయం 7.00 గంటలకు 3 బస్సులలో 100 మంది విద్యార్థులు కరీంనగర్ నుండి బయలుదేరడం జరిగింది.వీరి వెంట తిరుపతి ఏ ఎస్ డబ్ల్యూ వో, 13 మంది హెచ్ డబ్ల్యూ వో, 12 మంది క్లాస్ - 4 ఉద్యోగులు పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు టూరిజం పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ కరీంనగర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్.నాగార్జున, ఉపసంచాలకులు, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ, కరీంనగర్ ఎం వెంకట్ రాంబాబు, యూత్ ఆఫీసర్ మరియు షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## విదినిర్వహనలో గుండెపోటుతో మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ సోమేశ్వర్ రావు

* పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



సాక్ష్యంన్యూస్ జనవరి02(దంతాలపల్లి ప్రతినిధి జెల్ల శ్రీనివాస్): మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పోలీస్ స్టేషన్ లో రైటర్ గా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబు ల్ సోమేశ్వరరావు తెల్లవారుజామున గుండెపోటుతో మృ తి చెందారు.తన స్వగ్రామం దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామంలో ఆదివారము మహబూబా బాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్, మహబూ బాబాద్ డిఎస్పీ తిరుపతిరావులు కానిస్టేబుల్ పార్థివదే హానికి నివాళులు అర్పించారు. అదేవిధంగా తన కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని దైర్యం చెప్పారు.

## క్రికెట్ కప్‌లో పోలీస్ టీం ఘనవిజయం..







భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ,(ఫిబ్రవరి 02):ఫ్రెండ్లీ క్రికెట్ కప్ లో పోలీస్ టీం ఘన విజయం సాధించింది .వివరాల్లోకెళ్తే ఆదివారం క్రికెట్ కప్ 2025 మణుగూరు భద్రాద్రి స్టేడియంలో సింగరేణి యాజమాన్యం నిర్వహించారు .ఈ టోర్నమెంట్లో ప్రెస్ క్లబ్ టీం, పోలీస్ టీం, సింగరేణి ఆఫీసర్స్ టీం , రెవెన్యూ అధికారుల టీమ్ పాల్గొనడం జరిగింది. ఈ టోర్నమెంట్ లో భాగంగా మొదటగా సింగరేణి ఆఫీసర్స్ టీం ప్రెస్ క్లబ్ టీమ్ తో జరిగిన మొదటి మ్యాచ్లో ఐదు వికెట్ల తేడాతో విజయం సొంతం చేసుకుంది.ప్రెస్ క్లబ్ టీం మొదటిగా బ్యాటింగ్ చేస్తూ 51 పరుగులకు ఆల్ అవుట్ అయ్యారు. మణుగూరు ఆఫీసర్స్ టీం లోని మనోహర్, అండర్ మేనేజర్ అత్యంత ప్రతిభ కనబరుస్తూ 3 ఓవర్లు బౌలింగ్ చేసి ఐదు వికెట్లు సాధించాడు. తరువాత బ్యాటింగ్ ప్రారంభించిన ఆఫీసర్స్ టీం 7 ఓవర్లలోనే ఆరు వికెట్లు కోల్పోయి విజయం సాధించారు. ఈ టీంలో మనోజ్ కుమార్, అండర్ మేనేజర్ అత్యధికంగా రెండు ఫోర్ల సాయంతో 20 పరుగులు చేసి మణుగూరు ఆఫీసర్స్ టిం విజయంలో కీలకపాత్ర వహించిన బౌలర్ మనోహర్ కుమ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ప్రకటించడం జరిగింది.ఈ విజయంతో మణుగూరు ఆఫీసర్ టీం ఫైనల్ కు అర్హత సాధించింది. రెండవ మ్యాచ్ రెవెన్యూ టీం మరియు పోలీస్ టీం మధ్య జరిగిన మ్యాచ్లో, పోలీస్ టీం 8 పరుగుల తేడాతో విజయం సాధించి ఫైనల్లో అడుగు పెట్టింది. ముందుగా బ్యాటింగ్ చేసిన పోలీస్ టీమ్ లోని శ్రీ గోవిందు ఒక సిక్సర్ మూడు ఫోర్ లతో 22 పరుగులు సాధించాడు .సత్యనారాయణ ఒక సిక్సర్ ఒక ఫోర్ సాయంతో 19 పరుగులు సాధించాడు.పోలీస్ టీం నిర్ణయిత 12 ఓవర్లో ఏడు వికెట్లు కోల్పోయి 92 పరుగులు సాధించారు. రెవెన్యూ టీం లోని శ్రీ మస్తాన్5 8 పరుగులు ఇచ్చి విలువైన మూడు వికెట్లు పడగొట్టాడు.83 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రెవెన్యూ టీం లోని శ్రీకాంత్ అత్యధికంగా 4 పోర్ల సహాయంతో 34 పరుగులు చేశాడు. చివరివరకు నువ్వా నేనా అంటూ సాగిన మ్యాచ్లో చివరకు పోలీస్ టీం 8 పారుగులతో విజయం సాధించింది. ఈ టీంలోనీ ఎల్ గోపాల్ 14 పరుగులు ఇచ్చి రెండు కీలక వికెట్లు పడగొట్టడం జరిగింది. పోలీస్ టీం విజయం లోని బ్యాటర్ ఈ గోవింద్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపికయ్యారు.ఫైనల్ మ్యాచ్ మణుగూరు ఆఫీసర్స్ టీం, పోలీస్ టీం మధ్యన జరిగిన మ్యాచ్లో పోలీస్ గేమ్ పరుగుల తేడాతో విజయం సాధించింది.బ్యాటింగ్ చేసిన పోలీసు టీం నిర్ణయిత 12 ఓవర్లో 5 వికెట్లకు 103 పరుగులు చేశారు పోలీస్ టీం లోని గోవిందు 2 సిక్సర్లు ఐదు ఫోర్లతో 52 పరుగులు,103 పరుగుల చేదనలో మణుగూరు ఆఫీసర్స్ టీం 7 వికెట్ల నష్టానికి 86 పరుగులకు మాత్రమే చేసి పరాజయం పాలైంది.ఈ టీంలో బిందు సాగర్, సీనియర్ అండర్ మేనేజర్ సహాయంతో 39 పరుగులు చేసి జయంగా నిలవడం జరిగింది. గోవింద్ ఉత్తమ బ్యాట్స్మెన్ గా, మనోహర్ ఉత్తమ బౌలర్ గా, సర్వర్ నబి ఉత్తమ వికెట్ కీపర్ గా , లక్ష్మి లక్ష్మీపతి గౌడ్ జనరల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, డి.ఎస్.పి, అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ డిజిఎం పర్సనల్, సింగ్ శ్రీనివాస్ , సీనియర్ పిఓ, పర్సనల్ డిపార్ట్మెంట్, వెంకట్ ప్రెస్ క్లబ్ మణుగూరు ప్రెసిడెంట్, అధికారులు ఉన్నతాధికారులు, తదితరులు ,పాల్గొన్నారు.

## అవార్డులు అందుకున్న అర్చకులు




ములుగు ప్రతినిధి ఫిబ్రవరి 2 (సాక్ష్యం) స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు 2025. పురస్కరించుకొని. తెలుగు వెలుగు నంది పురస్కారాల మహోత్సవ అవార్డులను ఆదివారం తెలుగు వెలుగు సాహితి వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ సౌజన్యంతో కాళోజి తెలుగు పురస్కార అవార్డులకు. ఏటూరు నాగారం. రామాలయం అర్చకులు నాగేశ్వరరావు శర్మ. సాయిబాబా దేవస్థానం ప్రధాన అర్చకులు భాను ప్రకాష్ శర్మ. మల్లూరు దేవస్థానం అర్చకులు రాజశేఖర్ శర్మ లకు అవనిగడ్డ జనసేన ఎమ్మెల్యే మాజీ డిప్యూటీ స్పీకర్ బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా అవార్డులు ప్రధానం చేయడం జరిగింది. ఇట్టి అవార్డులను ఆంధ్రప్రదేశ్. తెలంగాణ. తమిళనాడు. కర్ణాటక. ఒరిస్సా. మహారాష్ట్ర. పాండిచ్చేరి. రాష్ట్రాల్లోని అర్చక రంగంలో విశిష్టమైన కృషి చేసినందుకు వారి సేవలను గుర్తించి తెలుగు వెలుగు నంది పురస్కారం 2025 అందించడం జరిగింది. మానవ జన్మ ఎత్తినందుకు ఎంతో కొంత సార్ధకత ఉండాలి ఏదో సాధించాలి తాను కొందరికైనా మరొక దర్శకంగా ఉండాలని ఏ కొందరిలో ఈ తపన ఉంటుంది. అలాంటి వారి చరిత్రలో నిలిచిపోతారు. ఆణిముత్యం లాంటి అతిరథ మహా రదులను వారి ప్రతిభ పాటవాలను కృషిని ప్రశంసిస్తూ. భవిష్యత్తులో మరెన్నో అద్భుతాలు విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ. వారిని ప్రోత్సహిస్తూ. బాసర జ్ఞాన సరస్వతి దేవి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని. పురస్కారాలు అందించడం అభినందనీయం అన్నారు. జాతీయస్థాయిలో అందించే ఇట్టి అవార్డులకు మన ములుగు ప్రాంతం ఏటూర్ నాగారం మంగపేట మండలాలకు చెందిన అర్చకులు ఎంపిక కావడంపై. అవార్డు అందుకోవడంతో ఆలయ అర్చకులను గ్రామ ప్రజలు షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ఆలయ కమిటీ బచ్చు కడివెండి పర్వతాల కుమారస్వామి.లు అభినందనలు తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



దేవరకొండ: చింతపల్లి: సాక్ష్యం న్యూస్: ఫిబ్రవరి 2 చింతపల్లి మండలం మాజీ జడ్పిటిసి సభ్యులు కంకణాల ప్రవీణ వెంకరెడ్డి గార్ల కూతురు. కంకణాల సౌమ్య, అనిల్ వెంకటరెడ్డిల వివాహ వేడుకకు తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్. ఆయనతోపాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## అర్ద శాతాబ్దం... పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వరంగల్ లోని జెపిఎన్ రోడ్ మహభూబియా హై స్కూల్ లో 1974-75 సంవత్సరం లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం మడికొండ కరిష్మా ఫంక్షన్ హాల్ లో కుటుంబ సభ్యులతో కలుసుకొని ఆనందాన్ని పంచుకొన్నారు... పదవ తరగతి 50 ఏళ్ల క్రితం పూర్తి చేసుకొని ఈరోజు దాదాపు 50 మంది విద్యార్థులు కలుసుకోవడం మరియు ఇద్దరు ఉపాధ్యాయులను సన్మానం చేయడం సంతోషం అన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు ప్రభాకర్ రావు పాషా విద్యార్థులు డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యా దేవేందర్ రెడ్డి నాగేశ్వరావు నాగేంద్ర బాబు వెంకట స్వామి భవాని శంకర్ వెంకట రత్నం తదితరులు పాల్గొన్నారు

## ప్రజల ఆరోగ్యం కోసమే మెగా వైద్య శిబిరం

* 250 మందికి ఉచిత వైద్య పరీక్షలు
* 1,50,000 విలువగల మందులు ఉచితంగా పంపిణీ



ములుగు ప్రతినిధి ఫిబ్రవరి 02 (సాక్ష్యం) ఉచిత వైద్య శిబిరంలో 250 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి. 1,50,000 రూ .విలువగల మందులను ఉచితంగా అందించడం జరిగింది.ఏటూర్ నాగారం పోలీస్ మరియు శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయం ఏటూర్ నాగారం వారి సౌజన్యంతో .న్యూ వన్ అపోలో హాస్పిటల్ ఏటూర్ నాగారం మరియు. దాత్రి ఆర్థోపెడిక్ & సైక్రియాట్రి హాస్పిటల్ వరంగల్ వారి. సహకారంతో. ఉచిత ఆర్థో జనరల్ మెగా వైద్య ఉచిత శిబిరం. ప్రజల ఆరోగ్యం కోసమే ఉచిత మెగా వైద్య శిబిరం ను సంయుక్తంగా ఏటూరు నాగారం గ్రామీణ ప్రాంతంలో ఆదివారం షిరిడి సాయిబాబా దేవాలయం ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి వైద్య శిబిరం ను స్థానిక పోలీస్ అధికారులు. ఆలయ కమిటీ చైర్మన్. వైద్యాధికారులు ఆలయ సిబ్బంది వైద్య శిబిరం ను ప్రారంభించారు. పేద మధ్య తరగతి వర్గాలు ఎక్కువగా ఉన్న మారుమూల ఏజెన్సీ గ్రామీణ ప్రాంతం ఏటూర్ నాగారంలో అధునాతన వైద్యాన్ని అందుబాటులోకి గ్రామీణ ప్రజల కోసం తీసుకురావడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో కార్పొరేట్ ఆసుపత్రిలో లభించే వైద్య పరీక్షలను. అందుబాటులోకి ఉచితంగా తీసుకొచ్చి పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేయడం జరిగింది.గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి వైద్య నిపుణులు. వైద్యాధికారులు.సిబ్బంది గ్రామీణ ప్రాంతాలకు వచ్చి సేవ చేయడం నిజం గా అదృష్టంగా భావిస్తున్నామన్నారు.విద్య వైద్యం ఆరోగ్యం మొదలైన రంగాలలో ప్రాధాన్యమిచ్చి ఆదర్శ ఆరోగ్యవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దడం కోసం అందరం సంయుక్తంగా కృషి చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం స్థానిక ఎస్సై తాజుద్దీన్. షిరిడి సాయిబాబా ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్.వైద్య నిపుణులు. డాక్టర్ అంబటి అజయ్ కుమార్. ఎముకలు కీళ్లు మరియు వెన్నుముక వైద్య నిపుణులు. డాక్టర్ నమ్రత దేవులపల్లి నరములు మరియు మానసిక వైద్య నిపుణులు. డాక్టర్ డి రామారావు ఎంబీబీఎస్. ఎండి. బీపీ షుగర్ అస్తమా జనరల్ వైద్య నిపుణులు. వైద్యశాల మేనేజర్ అనిల్ రాజు. సిబ్బంది వెంకటేష్ .నికిత. రమేష్ .రాకేష్ .అంకిత. సృజన్. మరియు ఆలయ కమిటీ సభ్యులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


## అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచిన త్రిషకు అభినందనలు

* జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ,(ఫిబ్రవరి 02): మలేషియాలో జరిగిన అండర్ 19 మహిళల ప్రపంచ కప్ ఫైనల్ లో అత్యుత్తమ ప్రదర్శన ను కనబరిచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వాసి గొండిగ త్రిషకు జిల్లా ప్రజలందరి తరపున జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అభినందనలు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పేరును ప్రపంచ వేదికలో నిలబెట్టి, చివరి మ్యాచ్లో అద్భుతంగా రాణించి బౌలింగ్ ,బ్యాటింగ్ లో ఉత్తమ ప్రదర్శన ద్వారా ఇండియా టీం అండర్ 19 ప్రపంచ కప్ సాధించడానికి ముఖ్య కారణమై, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ గా నిలిచినందుకు జిల్లా ప్రజలందరి తరపున ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. త్వరలోనే ఆమెను ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు.




## టీయుడబ్ల్యూజేహెచ్-143



* మహాసభలను విజయవంతం చేయాలి
* రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మహమ్మద్ రఫీ
* ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతులమీదుగా పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడ, ఫిబ్రవరి 02, (సాక్ష్యం): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టి యు డబ్ల్యూ జే హెచ్ 143 మూడు జిల్లాల మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మహమ్మద్ రఫీలు పిలుపునిచ్చారు. ఈనెల 9న వేములవాడ పట్టణంలోని మహాదేవ్ కళ్యాణ మండపంలో మహాసభను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మహాసభకు సంబంధించిన వాల్ పోస్టర్ ను వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతులమీదుగా ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు చెందిన జర్నలిస్టులు మహాసభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మహాసభకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు తాహెర్ పాషా, రేగుల రాంప్రసాద్, కొలిపాక నర్సయ్య, తీగల మల్లికార్జున్, కనకారెడ్డి, పాశం భాస్కర్ రెడ్డి, జిల్లా రమేష్, కొత్వాల్ శ్రీనివాస్, మహమ్మద్ అజీమ్, కమలాకర్, షేక్ రియాజ్, దేవరాజు, బుర్ల సందీప్, ప్రదీప్, దుర్గం పరశురాం, అబ్బగోని రవీందర్, ప్రవీణ్, సయ్యద్ ఫహద్ పాషా, కోడం గంగాధర్, శ్రీకాంత్, ముషాహిద్, ఇమ్రాన్, షబ్బీర్, జునైద్, జబ్బార్, నాగరాజు, గంగాధర్, హరీష్,షోయబ్, శ్యామ్ లతో పాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.



# ఆమె లక్ష్యం, గమ్యం...

# ఏడు ఖండాల్లో ఏడు శిఖరాలు



**సామాన్య కుటుంబంలో పుట్టిన ఆమె అసాధారణమైన మార్గాన్ని ఎంచుకున్నారు. ఏడు ఖండాల్లోని ఏడు పర్వతాల ఆరోహణ లక్ష్యంగా సాగుతున్న ఆమె ప్రయాణం... ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం నాడు అయిదో శిఖరాగ్రాన్ని చేరుకుంది. అర్జెంటీనాలోని అకాంగోవా పర్వతంపై భారత జాతీయ పతాకాన్ని ఎగురవేసి... 'భారత్‌మాతాకీ జైసామాన్య కుటుంబంలో పుట్టిన ఆమె అసాధారణమైన మార్గాన్ని ఎంచుకున్నారు. ఏడు ఖండాల్లోని ఏడు పర్వతాల ఆరోహణ లక్ష్యంగా సాగుతున్న ఆమె ప్రయాణం... ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం నాడు అయిదో శిఖరాగ్రాన్ని చేరుకుంది. అర్జెంటీనాలోని అకాంగోవా పర్వతంపై భారత జాతీయ పతాకాన్ని ఎగురవేసి... 'భారత్‌మాతాకీ జై**

ఆమె లక్ష్యం, గమ్యం... ఏడు ఖండాల్లో ఏడు శిఖరాలు: సామాన్య కుటుంబంలో పుట్టిన ఆమె అసాధారణమైన మార్గాన్ని ఎంచుకున్నారు. ఏడు ఖండాల్లోని ఏడు పర్వతాల ఆరోహణ లక్ష్యంగా సాగుతున్న ఆమె ప్రయాణం... ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం నాడు అయిదో శిఖరాగ్రాన్ని చేరుకుంది. అర్జెంటీనాలోని అకాంగోవా పర్వతంపై భారత జాతీయ పతాకాన్ని ఎగురవేసి... 'భారత్‌మాతాకీ జై' అంటూ ఆమె చేసిన నినాదం కొండ కోనల్లో ప్రతిధ్వనించింది. రెట్టించిన ఉత్సాహంతో మరో రెండు పర్వతాల అధిరోహణకు సిద్ధమవుతున్న తెలుగు యువతి పడమటి అన్విత సాహసోపేతమైన కథ ఇది...

''పర్వతారోహణకు ధైర్య సాహసాలతోపాటు వాతావరణ పరిస్థితులను తట్టుకొనే దారుఢ్యం, ఓర్పు, సమయస్ఫూర్తి ఉండాలి. దాని కోసం నిరంతరమైన సాధన అవసరం అవుతుంది. దక్షిణ అమెరికాలోని అర్జెంటీనాలో ఉన్న అకాంగోవా పర్వతారోహణ కూడా ఎన్నో సవాళ్ళు విసిరింది. ఈ నెల (2025 జనవరి) 10వ తేదీన మన దేశంలో బయలుదేరి... 12వ తేదీన అర్జెంటీనా చేరుకున్నాను. సముద్ర మట్టానికి 6,961 మీటర్ల ఎత్తులో ఉన్న అంకాగోవా పర్వతాన్ని ఎక్కడానికి అవసరమైన డాక్యుమెంటేషన్ పూర్తి చేశాను. మా బృందంలో మొత్తం తొమ్మిదిమంది ఉన్నాం. అయిదుగురు మహిళలం, నలుగురు పురుషులు. మేము 13వ తేదీన బేస్‌క్యాంప్ నుంచి పర్వతారోహణ ప్రారంభించాం. మైనస్ 25 నుంచి మైనస్ 30 డిగ్రీల అతి శీతలమైన వాతావరణంలో, తీవ్రమైన చలిగాలుల మధ్య మా యాత్ర సాగింది. బేస్‌క్యాంపనకు, గమ్యానికి మధ్య 70 శాతం భాగం మంచుతో కప్పేసి ఉంది. మిగిలిన భాగమంతా జారుడుగా ఉన్న రాళ్ళ మార్గం. దాదాపు 6 వేల మీటర్ల ఎత్తుకు చేరుకొనేసరికి... పరిస్థితులను భరించలేక ఆరుగురు వెనుతిరిగారు. ఇద్దరు పురుషులు, నేను మాత్రమే గమ్యాన్ని చేరుకోగలిగాం. 13 రోజులపాటు సాగిన మా ఆరోహణ.... మన గణతంత్ర దినమైన జనవరి 26వ తేదీ ఉదయంఅకాంగోవా శిఖరాగ్రం దగ్గర ముగిసింది. అక్కడ మన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశాను. 'భారత్ మాతాకీ జై' అని నినదిస్తూ మన దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపాను. ఆ క్షణంలో... నాలో ఏదో మహత్తరమైన భావోద్వేగం. భువనగిరి ఖిల్లా మీద...

మాది తెలంగాణలోని యాదాద్రి-భువనగిరి జిల్లా భువనగిరి. నాన్న పడమటి మధుసూదన్‌రెడ్డి వ్యవసాయం చేస్తారు. అమ్మ చంద్రకళ అంగన్వాడీ టీచర్. నాలుగేళ్ళ క్రితం ఎంబీయే పూర్తి చేశాను. పర్వతారోహణ పట్ల నా ఆసక్తిని గమనించిన ట్రాన్సెండ్ అడ్వంచర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎం.డి. ఎవరెస్టర్ శేఖర్‌బాబు ఆ దిశగా ప్రోత్సహించారు. ఆయన పర్యవేక్షణలో భువనగిరి ఖిల్లా మీద నా ప్రాథమిక శిక్షణ సాగింది. అప్పుడే ఏడు ఖండాల్లోని ఏడు ఎత్తైన పర్వతాలను అధిరోహించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. దేశ, విదేశాల్లోని అనేక పర్వతాల ఆరోహణతో నా సామర్థ్యానికి మెరుగులు దిద్దుకున్నాను. ఆఫ్రికా ఖండంలో... సముద్రమట్టానికి 5,896 మీటర్ల ఎత్తులో ఉన్న ఖిలిమంజారోను 2020 జనవరిలో అధిరోహించడంతో నా సప్త ఖండాల పర్వతారోహణ మొదలయింది. 2021 డిసెంబరు 7న 5,642 మీటర్ల ఎత్తైన ఎల్‌బ్రస్ (యూరప్), 2022 మే 16న ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 8,848.86 మీటర్ల ఎవరెస్ట్ శిఖరం (ఆసియా ఖండం), 2022 డిసెంబరు 17న సముద్రమట్టానికి 4,892 మీటర్ల ఎత్తులో ఉన్న విన్సన్ (అంటార్కిటికా) పర్వతాలను అధిరోహించాను. అయిదవదిగా... దక్షిణ అమెరికా ఖండంలోని అకాంగోవా కూడా పూర్తయింది. దీనికి హైదరాబాద్‌కు చెందిన అన్విత కన్‌స్ట్రక్షన్స్ ఆర్థిక సాయం చేసింది. ట్రాన్సెండ్ అడ్వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రమోటర్‌గా వ్యవహరించింది. ప్రస్తుతం అన్విత ట్రాన్సెండ్ అకాడమీ సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తున్నాను. ఇంకా... ఉత్తర అమెరికా ఖండంలోని అలస్కాలో... సముద్ర మట్టానికి 6,990 మీటర్ల ఎత్తులో ఉన్న డెనాలీ పర్వతాన్ని, అస్ట్రేలియాలో సముద్రమట్టానికి 2,228 మీటర్ల ఎత్తైన ఖోజిస్కో పర్వతాన్ని అధిరోహించాలి. త్వరలోనే వాటిని కూడా ఎక్కి... నా లక్ష్యాన్ని నెరవేర్చుకుంటాను.''



# బాల్యంలోకి తొంగిచూద్దామా!

కార్పొరేట్ ప్రపంచంలో 'పని ఒత్తిడి' కామన్ అయిపోయింది. ఉద్యోగుల మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఈ క్రమంలో.. 'కిడల్టింగ్' వారికి భరోసా ఇస్తున్నది. పాశ్చాత్య దేశాల్లో ఎప్పటినుంచో ఉన్న ఈ ట్రెండ్.. మన దగ్గర ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం పొందుతున్నది. పెద్దవాళ్లను బాల్యంలోకి తీసుకెళ్లే ఈ నయా ట్రెండ్ సంగతులివి..పార్క్‌లో వాకింగ్ చేస్తున్నప్పుడు.. పిల్లల ప్లేగ్రౌండ్‌లో ఒకరిద్దరు పెద్దవాళ్లు కనిపిస్తుంటారు. ఊయల ఊగుతూ..స్లైడింగ్‌పై నుంచి జారుతూ.. పిల్లల్లో చిన్నపిల్లల్లా కలిసిపోయి.. ఆడుకుంటూ ఉంటారు. ఆ క్షణం.. తమకున్న అన్ని టెన్షన్లనూ పక్కన పెట్టేస్తారు. మనస్తత్వ నిపుణులు చెబుతున్న 'కిడల్టింగ్ ట్రెండ్' అదే! పిల్లలతో కలిసి సైకిల్ తొక్కడం, బొమ్మలు గీయడం, క్యారమ్స్ ఆడటం, లెగోస్‌తో బొమ్మలు చేయడం.. ఇలాంటి చిన్ననాటి ఆటలు, పెద్దవాళ్ల గతాన్ని తవ్వితీస్తాయి. తాము స్వేచ్ఛగా, ఆనందంగా గడిపిన సమయంలోకి తీసుకెళ్తాయి. బాల్య జ్ఞాపకాల్ని తట్టిలేపుతాయి.ముఖ్యంగా నెలవారీ టార్గెట్‌లు, ఆడిట్ లాంటి ఒత్తిడిని పెంచే పనులు ఉన్నప్పుడు.. 'కిడల్టింగ్' ఉపశమనం ఇస్తుందని మానసిక నిపుణులు అంటున్నారు. వాకింగ్ తర్వాత కాసేపు పార్క్‌లోనే ఆడుకోవడం, బోర్డ్ గేమ్‌లలో మునిగిపోవడం వంటి ఏ రకమైన చర్య అయినా.. మిమ్మల్ని ఉత్సాహపరుస్తుంది. అంతేకాకుండా.. చిన్నపిల్లల్లా ఆనందించడం వల్ల వారిలో 'నోస్టాల్జియా' భావాలు పెరుగుతాయి. ఇవి గతానికి-వర్తమానానికి మధ్య బలమైన సంబంధాన్ని ఏర్పరుస్తాయి. బాధలో ఉన్నవారికి ఓదార్పునిస్తాయి. భరోసానిస్తాయి. మానసిక ఆరోగ్యానికీ ఎంతో మేలుచేస్తాయి. కిడల్టింగ్.. శరీరంలో డోపమైన్ ఉత్పత్తిని పెంచుతుందట. ఇది.. మనిషిలో ఒత్తిడి, విచారం, కోపం, ఆందోళనను తగ్గిస్తుందట.



**సంస్థల ప్రోత్సాహం కూడా..**

కొన్ని కార్పొరేట్ సంస్థలు కూడా పెద్దవాళ్లను కిడల్టింగ్ దిశగా ప్రోత్సహిస్తున్నాయి. అమెరికాలో టాయ్ అసోసియేషన్ ఓ సర్వే నిర్వహించింది. అక్కడ పిల్లల బొమ్మలు, ఆట వస్తువులను కొనుగోలు చేసిన 2,000 మంది తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించింది. వారిలో 58 శాతం మంది.. పిల్లల కోసం కాకుండా, తమ కోసమే బొమ్మలు, ఆట వస్తువులు కొనుగోలు చేశారని నివేదించింది. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ప్రధాన నగరాల్లో పెద్దలు ఆడుకునేలా 'బల్లీ బాలర్సన్' కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటిని ప్రతినెలా వేలాదిమంది సందర్శిస్తున్నారు కూడా! మరెందుకు ఆలస్యం.. ఆఫీస్, ఆర్థిక, కుటుంబ సమస్యలన్నీ మరిచిపోండి. రోజులో కొంత సమయమైనా చిన్నపిల్లల్లా గడపండి. మళ్లీ బాల్యంలోకి వెళ్లండి.. ఒత్తిడిని జయించండి.


# చెప్పుల్లో సేఫ్టీ ఫీచర్!



ఎన్ని చట్టాలు వచ్చినా, ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా.. ఇప్పటికీ 'మహిళల భద్రత' గాలిలో దీపమే! దేశంలో రోజురోజుకూ మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతుండటం.. ఆందోళన కలిగించే అంశమే! ఈ క్రమంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఇద్దరు పాఠశాల విద్యార్థులు.. మహిళల భద్రతకు భరోసా ఇచ్చే లక్ష్యంతో ఒక ప్రత్యేకమైన ఆవిష్కరణ చేశారు. ఇంటిగ్రేటెడ్ ఎస్ఓఎస్ (సేవ్ అవర్ సోల్) సేఫ్టీ ఫీచర్‌తో.. సరికొత్త చెప్పులకు రూపకల్పన చేశారు.ఇవి ఆపదలో ఉన్న ఆడవాళ్లకు అండగా నిలుస్తాయని ఆవిష్కర్తలు అమృత్ తివారీ, కోమల్ జైస్వాల్ అంటున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన ఈ చెప్పుల్లో.. కాలికింద ఎస్ఓఎస్ బటన్‌ను ఏర్పాటుచేశారు. ఈ బటన్‌ను ప్రత్యేక యాప్‌ద్వారా ఫోన్‌కు కనెక్ట్ చేస్తారు.మహిళలు తమకు ఏదైనా ఆపద పొంచి ఉన్నట్టు భావిస్తే.. వెంటనే ఈ బటన్‌ను ప్రెస్ చేస్తే చాలు. యాప్‌లో అప్పటికే సేవ్ చేసి ఉన్న కుటుంబసభ్యులు, స్నేహితుల నెంబర్లకు హెచ్చరిక మెసేజ్‌లు వెళ్తాయి. సందేశం అందుకున్నవాళ్లు వెంటనే అప్రమత్తం అవుతారు. అంతేకాదు.. వారు ఉన్న లొకేషన్‌తోపాటు ఆడియోను రికార్డ్ చేసి మరీ పంపిస్తుంది. అలా.. ఆపదలో ఉన్నవారు ఎక్కడ ఉన్నారో? వారి చుట్టూ ఏం జరుగుతుందో తెలుసుకునే అవకాశం ఉంటుంది.ఇందులో మరో సేఫ్టీ ఫీచర్.. ఈ చెప్పులు 'స్టన్ గన్' మాదిరిగానూ పనిచేస్తాయి. దాడిచేసే వ్యక్తిని అడ్డుకోవడానికి చిన్న విద్యుత్ షాక్‌ను ఇస్తాయన్నమాట. భవిష్యత్తులో.. ఈ చెప్పుల్లో కెమెరాను ఇన్‌స్టాల్ చేయాలని భావిస్తున్నట్లు ఆవిష్కర్తలు చెబుతున్నారు. తద్వారా బాధితుల చుట్టుపక్కల ఏం జరుగుతున్నదో చూడొచ్చు.

# బడ్జెట్ లైఫ్

**'కాదేదీ కవితకు అనర్హం' కవి మాట. 'లేదేదీ పన్నుకు అనర్హం' విత్తమంత్రి పాట. బడ్జెట్ ఘడియలు సమీపిస్తున్న కొద్దీ.. దలాల్ స్ట్రీట్‌లో బుల్, బేర్‌లు రేసుకు సిద్ధమవుతుంటాయి. కనీవినీ ఎరుగని బడ్జెట్ అని సమర్థించుకోవడానికి అధికార పక్ష సభ్యులు లెక్చర్లు ప్రిపేర్ అవుతుంటారు. పసలేని నస అని కొట్టిపారేయడానికి విపక్షాలూ కత్తులు నూరుతుంటాయి. ఇక సగటు ఉద్యోగి దగ్గరికి వచ్చేసరికి పుచ్చుపట్టిన తన ఆదాయానికి ఈసారైనా పన్ను పోటు తగ్గుతుందేమో అని ఆశగా ఎదురుచూస్తుంటాడు. ఇంటిని నడిపే ఇల్లాలైనా, ఉద్యోగం చేస్తున్న అతివైనా.. బడ్జెట్ సమీపిస్తున్నప్పుడు ఏదో ఆశిస్తుంది. ఎందుకంటే.. బడ్జెట్ ప్రభావాన్ని పరోక్షంగా అందరికన్నా ఎక్కువగా ఫేస్ చేసేది వీళ్లే. కొద్ది గంటల్లో నయా బడ్జెట్ ప్రవేశిస్తున్న వేళ ఆమె మనసులో ఏముందో తెలుసుకుందాం..**



బడ్జెట్ మరుసటి రోజు నుంచీ.. ఆమెకు సవాళ్లు ఎదురవుతాయి. ప్రతి ఉదయం ఆప్యాయంగా పలకరించే పాలవాడు.. ఎందుకో ఆ పూట పాలివాడిగా కనిపిస్తాడు. ఆ ఇల్లాలి అనుమానాలను నిజం చేస్తూ.. 'ఇవాళ్టి నుంచి లీటరుకు రెండు రూపాయలు ఎక్కువగా ఇవ్వాలమ్మా!' అని అడిగేస్తాడు. అన్నీ తెలిసినా 'ఏ.. ఎందుకు?' అని ప్రశ్నిస్తే.. 'బడ్జెట్' అంటాడంతే! లీటరుకు రెండు రూపాయలు.. రోజుకు లీటరున్నర.. నెలకు 90 రూపాయలు కృష్ణార్పణం అనుకుంటుంది. పాలవాడితో పేచీ పెట్టుకోవడం పెద్ద విషయం కాదామెకు. డిస్కషన్స్‌లో పడితే ఆఫీసుకు ఆలస్యం అవుతుంది. అందుకే, 'సర్లే చూద్దాం' అనేస్తుంది. ఎంతైనా మధ్యతరగతి గృహిణి, అందులోనూ ప్రైవేట్ ఉద్యోగిని ఇంతకన్నా ఏం చెప్పగలుగుతుంది?

పాలు గిన్నెలో పుచ్చుకొని వంటింట్లో ప్రవేశించడంతోనే.. నిండుకుంటున్న పప్పు దినుసులు, డబ్బాలో ఆఖరికొచ్చిన చాయపత్తా వెటకారంగా చూస్తాయి. తిరగమోత వేళ కాకముందే.. పోపులపెట్టెలో దాచుకున్న చిల్లర అల్లరి మొదలవుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడమే తమ లక్ష్యం అన్న విత్తమంత్రి మాటలకు కోరస్‌లా వినిపిస్తాయా నవ్వులు! ఎం.కామ్ చదివిన ఆ ఇల్లాలికి.. ఒక దేశం ఆర్థికంగా బలపడటానికి పాలకులు ఎంచుకునే వ్యూహం పన్ను అని తెలియనిది కాదు. కానీ, ఆ క్షణం మర్చిపోయినట్టు నటిస్తుంది. గుర్తుంటే గుండె బరువెక్కడం తప్ప ఏం చేయలేని పరిస్థితి.

పొయ్యి మీద టీ పొంగే సమయానికి వరండాలో ఆయనగారి పొగలు రింగులు చుడుతుంటాయి. సిగరెట్ల మీద ఏటా పన్నులు పెంచుతున్నా తాగేవాడు మానడే అని ఆమె ఫీలింగ్. ధరలు పెరిగాయని ధూమపానం మానేస్తారని అనుకోవడం హాస్యాస్పదం. బొక్కసం ఆదాయం పెంచుకునేందుకు సిగరెట్ల మీద ట్యాక్సు పెంచడం రివాజు. ధూమపానం అతనికే కాదు.. ఆ ఇంటి నెలసరి బడ్జెట్‌కు కూడా హానికరమే అని నిట్టూర్పు విడుస్తుంది! ఇక మద్యపాన ప్రియుల సంగతి సరేసరి! ఏటేటా పెరుగుతున్న పన్ను కడుతూ తామే సంక్షేమ సారథులని కాలరెగరేస్తున్న వారిని ఏమనగలం? ప్రజలను బలహీనతల నుంచి బయటపడేయకుండా.. పన్నులు పెంచి ఇదే కట్టడి మంత్రమని తరతరాలుగా విత్తమంత్రులు ప్రవచిస్తుండటం ఆ ఇల్లాలికే కాదు.. ఏ ఇంతికైనా కష్టమే అనిపిస్తుంది.

చదువుకున్నా, అక్షరం రాకున్నా.. పొదుపు సూత్రాలు అతివకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మదుపులోనూ ఆమె సిద్ధహస్తురాలు. చిన్న మొత్తాలు పోగేసి.. భవితను బంగారం చేయడంలో మహిళది అందవేసిన చేయి. ఆ ఆశతోనే కొద్దికొద్దిగా కూడబెట్టి బంగారం కొనాలని ఆశపడని తల్లి ఉండదు. కానీ, ప్రతినెలా పద్దుల పుస్తకం చూసుకుంటే.. లోటు బడ్జెట్ వెక్కిరిస్తూ కనిపిస్తుంది. నిత్యావసర సరుకుల మీద 5-18 శాతం ఉండే జీఎస్టీ.. బంగారం మీద మూడు శాతంగా ఎందుకుందో సామాన్యులకైతే అర్థం కాదు. పైగా రోజురోజుకూ ధర పెరుగుతున్న బంగారంపై మోజు చంపుకొని ఇమిటేషన్ ఆభరణాలు కొందామంటే వాటిపై జీఎస్టీ 12 శాతం. ఈ నేపథ్యంలో ఆభరణాల విషయంలో ఆమెకు పెద్ద సంతృప్తి మిగలదు.

గుండె ధైర్యం చేసుకుని బతుకుతున్న ట్యాక్స్ పేయర్స్ గుండెల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఆదాయ పన్ను పరిమితుల్లో మార్పులు, పన్నుల తగ్గింపులు కోరుకుంటున్నారు. ఈసారి బడ్జెట్‌లో ఆ ఆశలేమన్నా తీరతాయేమోనని ఇల్లాలు ఆశపడుతూనే ఉంటుంది. హెల్త్ ఇన్సూరెన్స్‌తో ఖర్చులు తగ్గించుకోవాలని చూస్తుంటే ఆ ఇన్సూరెన్స్ మీదా ట్యాక్స్ ఉంది. అదన్నా తగ్గిస్తే మేలని సాధారణ గృహిణే కాదు ఉద్యోగాలు చేసే ఆడవాళ్లూ ఆశపడుతున్నారు. నిత్యావసర సరుకులపై విధించిన పన్నులు సడలించాలని ఆశగా ఎదురు చూస్తున్నారు.

భార్యాభర్తలు ఉద్యోగాలు చేస్తున్న ఇళ్లల్లో ఆర్థిక వ్యవహారాలు కాస్త అనుకూలంగానే ఉంటాయి. ఈ పన్నుల విధానంపై వారికి అంత కోపతాపాలు ఉండవని అనుకుంటే పొరపాటే. చింతల్లేని చిన్న కుటుంబం ఓ చిన్న కారు కొనుక్కుందామని వెళ్తే అక్కడ లగ్జరీ కారుకు, చిన్న కారుకు ఒకే ట్యాక్స్! సంపన్నులపై ఎందుకంత ప్రీతో అర్థం కాదు. ఉద్యోగులపై మరో పిడుగు పన్నుపోటు.

ఉద్యోగి ఆశించిన స్థాయిలో పన్ను పరిమితి పెరిగిన దాఖలాలు బడ్జెట్ చరిత్రలో లేదు. ఏటా పెంచే పరిమితి బెత్తెడైతే.. పెరిగే ద్రవ్యోల్బణం బారెడు. ఇన్నిట్లో ఏం మిగులుతుంది? ఇన్ని సంగతులు ఆలోచిస్తున్న ఆమెకు మర్నాడు దిన పత్రికల్లో విత్తమంత్రి కట్టుకున్న చీర రంగు, రకం వివరాలు ప్రత్యేకంగా ఇవ్వడం అదనపు క్షోభకు గురిచేస్తాయి అనడంలో సందేహం లేదు.

# టీమ్ఇండియా భారీ విజయం

## 97 పరుగులకే కుప్పకూలిన ఇంగ్లాండ్

## 150 రన్స్‌తో భారత్ గ్రాండ్ విక్టరీ

ఐదో టీ20 మ్యాచ్‌లో టీమ్ఇండియా భారీ విజయం సాధించింది. భారత బౌలర్ల ధాటికి ఇంగ్లాండ్ కుప్పకూలింది. 248 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన ఇంగ్లాండ్ 10.3 ఓవర్లలో 97 పరుగులకే ఆలౌట్ అయ్యింది. దీంతో భారత్ 150 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఐదు టీ20ల సిరీస్‌ను టీమ్ఇండియా 4-1తో విజయవంతంగా ముగించింది. ఇంగ్లాండ్ టీమ్‌లో ఫిల్ సాల్ట్ 55(23), జాకబ్ బెతల్ 10(7)లు మాత్రమే రెండంకెల స్కోర్ సాధించగలిగారు. భారత బౌలర్లలో మహ్మద్ షమీ మూడు వికెట్లు తీయగా- వరుణ్ చక్రవర్తి, శివమ్‌దుబే, అభిషేక్‌శర్మలు రెండేసి వికెట్లు, రవి బిష్ణోయ్ ఒక వికెట్ పడగొట్టాడు. భారీ లక్ష్యంతో ఛేదనకు దిగిన ఇంగ్లాండ్‌కు ఫిల్ సాల్ట్ 55(23) దూకుడుగా ఆడి శుభారంభాన్ని ఇచ్చాడు. సాల్ట్ 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే, టీమ్ఇండియా బౌలర్లు విజృంభించడం వల్ల కెప్టెన్ బట్లర్ 7(7) సహా మిగతా ప్లేయర్లంతా చేతులెత్తేశారు. దీంతో ఐదో ఓవర్ నుంచి ప్రతి ఓవర్‌లో ఇంగ్లాండ్ జట్టు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. బెన్ డకౌట్ 0(1), హ్యారీ బ్రూక్ 2(4), లివింగ్‌స్టన్ 9(5), జాకబ్ బెతల్ 10(7), బ్రైడన్ కార్స్ 3(4), ఒవర్టన్ 1(3), జోఫ్రా ఆర్చర్ 1(2), రషీద్ 6(6), మార్క్ వుడ్ 0(1)కే పరిమితమయ్యారు.అంతకుముందు, బ్యాటింగ్‌కు దిగిన టీమ్ఇండియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. దీంతో ఇంగ్లండ్‌కు 248 పరుగుల లక్ష్యాన్ని విధించింది. అభిషేక్ సునామీ సెంచరీ(135)తో అదరగొట్టాడు. ఓ దశలో 280o పరుగులు సులభంగా వస్తాయనుకున్నా అభిషేక్‌కు తిలక్ (24), దూబె (30) మినహా ఇతర బ్యాటర్ల నుంచి సరైన మద్దతు లభించలేదు. దీంతో 235తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. శాంసన్ (16), సూర్య (2), పాండ్య (9), రింకు (9) నిరాశపరిచారు . అక్షర్ (15) ఆఖరులో వేగంగా ఆడలేకపోయాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో కార్స్ 3, వుడ్ 2, ఆర్చర్, రషీద్, ఒవర్టన్ తలో వికెట్ తీశారు.





# విశ్వవిజేతలుగా టీమ్ఇండియా అమ్మాయిలు

## డర్- 19 టీ20 వరల్డ్‌కప్ టైటిల్ సొంతం

## సౌతాఫ్రికాతో ఫైనల్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో విక్టరీ



టీమ్ఇండియా అండర్ 19 అమ్మాయిలు విశ్వ విజేతలుగా నిలిచారు. 2025 అండర్- 19 %u%20 వరల్డ్‌కప్ టైటిల్ నెగ్గారు. ఆదివారం సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో నెగ్గింది. సఫారీ జట్టు నిర్దేశించిన 83 పరుగుల లక్ష్యాన్ని, టీమ్ఇండియా అమ్మాయిలు 11.2 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి ఛేదించారు. గొంగడి త్రిష (44 పరుగులుబీ 33 బంతుల్లో: 8%ఇ%4) స్వల్ప ఛేదనలో అదరగొట్టింది. సనికె చక్లె (26 పరుగులు) రాణించింది. సౌతాఫ్రికా బౌలర్లలో రెనెకె 1 వికెట్ దక్కించుకుంది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 82 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్ల విజృంభనతో సఫారీ జట్టు విలవిల్లాడింది. మికీ వాన్ (23 పరుగులు)టాప్ స్కోరర్. నలుగురు ప్లేయర్లు పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు. టీమ్ఇండియా బౌలర్లలో త్రిష 3, పరునిక, ఆయూషి, వైష్ణవి తలో 2, షబ్నమ్ 1 వికెట్ దక్కించుకున్నారు. ఈ టోర్నీలో తెలుగమ్మాయి గొంగడి త్రిష అద్భుతంగా రాణించింది. ఇప్పటికే టోర్నీలో సెంచరీ బాదేసింది. ఫైనల్‌లోనూ మూడు వికెట్లతో రాణించింది. అటు ఛేదనను కూడా దూకుడుగా ఆరంభించింది. ఈ మ్యాచ్‌లో పరుగులు చేసింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో భారత విజయంలో కీలక పాత్ర పోషించింది. భారత్ వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా నిలిచింది. తెలుగు క్రికెటర్ గొంగడి త్రిష టోర్నీ ఆసాంతం బ్యాటింగ్, బౌలింగ్‌లో సత్తా చాటింది.

తుది జట్టు

భారత్: కమలిని (వికెట్ కీపర్), గొంగడి త్రిష, సనికా చల్కే, నికీ ప్రసాద్ (కెప్టెన్), ఐష్వరి, మిథిలా వినోద్, ఆయుషి శుక్లా, జోషిత వీజే, షబ్నమ్ షకిల్, పరుణిక సిసోదియా, వైష్ణవి శర్మ

దక్షిణాఫ్రికా: జెమ్మా బోథా, సిమోన్ లౌరెన్స్, డైరా రమ్లాకన్, ఫే కౌలింగ్, కౌలా రేనెకె (కెప్టెన్), కరాబో మెసో (వికెట్ కీపర్), మీకే వాన్ వూరస్ట్, సెష్నీ నాయుడు, ఆష్లే వాన్ విక్, మోనాలిసా లెగోడి, నిని

## అండర్ 19 వరల్డ్ కప్‌లో అదరగొట్టిన త్రిష

### 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' సహా 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ' అవార్డు సొంతం

అండర్- 19 టీ20 వరల్డ్ కప్ ఛాంపియన్‌గా టీమ్ఇండియా మహిళల జట్టు అవతరించింది. తెలుగు అమ్మాయి గొంగడి త్రిష బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి జట్టు విజయం కీలక పాత్ర పోషించింది. 44 పరుగుల చేసిన ఆమె, బౌలింగ్‌లోనూ మూడు వికెట్లు పడగొట్టింది. ఈ క్రమంలో త్రిషకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' సహా 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ' అవార్డు దక్కింది. అండర్- 19 టీ20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ అనంతరం త్రిష మాట్లాడింది. మిథాలీ రాజ్ తనకు రోల్ మోడల్ అని వెల్లడించింది. తనకు సహకరించిన టీమ్ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేసింది. ప్రతి అండర్-19 వరల్డ్ కప్ భారత్‌తోనే ఉండాలన్నది తన కోరికని పేర్కొంది. యంగ్ క్రికెటర్లకు అదే చెప్తానని వెల్లడించింది. "నా తండ్రికి ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును అంకితం చేస్తున్నాను. నన్ను నేను ఎప్పుడూ ఆల్ రౌండర్‌గా భావిస్తాను. దేశం తరపున ఆడటం, మరిన్ని మ్యాచ్‌లు గెలవడమే నా లక్ష్యం. నా బలం మీద నేనెప్పుడూ దృష్టిసారిస్తాను. ఈరోజు కూడా అదే పని చేశాను"అని త్రిష వ్యాఖ్యానించింది.

కాగా, గొంగడి త్రిష ఈ టోర్నీలో 309 పరుగులు చేసింది. ఈ క్రమంలో అండర్-19 మహిళల టీ20 ప్రపంచ కప్‌లో ఒకే ఎడిషన్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా రికార్డుకెక్కింది. ఈ ఘనత ఇప్పటివరకు టీమ్ ఇండియా ప్లేయర్ శ్వేతా సెహ్రావత్ పేరిట ఉండేది. తెలంగాణాలోని భద్రాచలానికి చెందిన త్రిష గత కొంత కాలంగా అంతర్జాతీయ స్థాయిలో స్థిరంగా రాణిస్తోంది. ప్రపంచకప్‌నకు ముందు జరిగిన ఆసియాకప్ లో 5 మ్యాచుల్లో 53 సగటుతో 159 రన్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఈ ఫామ్‌నే తాజా ప్రపంచకప్ లోనూ కొనసాగించింది. ఏడు మ్యాచుల్లో ఏకంగా 309 పరుగులు బాదింది. అలాగే ఏడు వికెట్లు సైతం తీసింది. దీంతో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' సహా 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ' అవార్డులు దక్కాయి.

# అభిషేక్ శర్మ అద్భుత సెంచరీ

## ఇంగ్లాండ్‌పై 37 బంతుల్లోనే సెంచరీ

## టీ20ల్లో రెండో వేగవంతమైన సెంచరీ నమోదు



భారత ఓపెనర్ అభిషేక్ శర్మ మరోసారి చెలరేగిపోయాడు. ఇంగ్లాండ్‌పై 37 బంతుల్లోనే అద్భుత సెంచరీని సాధించాడు. టీ20ల్లో ఇది రెండో వేగవంతమైన సెంచరీ కావడం విశేషం. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు తుపాన్ ఆరంభాన్ని అందించాడు. మైదానం నలువైపులా బౌండరీలు బాదుతూ అద్భుత శతకాన్ని సాధించాడు. ముఖ్యంగా 10 సిక్సర్లతో ఇంగ్లాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అలాగే కళ్లు చెదిరే నాలుగు బౌండరీలను కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. ఒక దశలో 35 బంతుల్లోపలే సెంచరీ చేసి రోహిత్ శర్మ వేగవంతమైన సెంచరీ రికార్డును అధిగమిస్తాడని భావించినా, తిలక్ వర్మ (24) వికెట్ కోల్పోవడం, బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో కాస్త లేటయ్యింది. మొత్తానికి టీ20ల్లో రెండో సెంచరీతో సత్తా చాటాడు. కెరీర్లో 17వ మ్యాచ్ ఆడుతున్న అభిషేక్ రెండో సెంచరీని సాధించడం విశేషం. ఇంతకు ముందు జింబాబ్వేపై తొలి సెంచరీని సాధించాడు. టాస్ గెలిచి ప్రత్యర్థిని బ్యాటింగ్‌కు ఆహ్వానించడం ఎంత పెద్ద పొరపాటో పవర్ ప్లే ముగిసే లోపే ఇంగ్లాండ్ కెప్టెన్ జోస్ బట్లర్‌కు తెలిసొచ్చింది. ముఖ్యంగా ఇద్దరు ఓపెనర్లు సంజూ శాంసన్ (7 బంతుల్లో 16), అభిషేక్ విధ్వంసమే ఎజెండాగా బరిలోకి దిగారు. ముఖ్యంగా సంజూ రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో మంచి టచ్‌లోకి వచ్చినా, అతడిని వుడ్ పెవిలియన్‌కు పంపాడు. దీంతో 23 పరగుల వద్ద తొలి వికెట్‌ను భారత్ కోల్పోయింది. అయితే ఆ తర్వాత అభిషేక్ బీస్ట్ మోడ్‌లోకి వచ్చి, ఎడాపెడా బౌండరీలు బాదాడు. ముఖ్యంగా సిక్సర్లతో ఇంగ్లాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ నేపథ్యంలో 17 బంతుల్లోనే అర్ధ సెంచరీని సాధించాడు. ఇక అభిషేక్‌తో పాటు తిలక్ కూడా రెచ్చిపోవడంతో పవర్ ప్లేలో భారత్ 95 పరుగులు సాధించింది. ఇక పవర్ ప్లేలో అత్యధిక స్కోరును ఈ మ్యాచ్‌లోనే భారత్ నమోదు చేసింది. 2021లో స్కాట్లాండ్‌పై చేసిన 82 పరుగుల రికార్డు తెరమరుగైంది. అలాగే గతేడాది హైదరాబాద్‌లో బంగ్లాదేశ్‌పై 82 పరుగుల స్కోరును సాధించింది. మరోవైపు పవర్ ప్లే ముగిసిన మూడో బంతికే వంద పరుగుల మార్కును సాధించింది. దీంతో టీ20ల్లో అత్యంత వేగవంతంగా వంద చేసిన రికార్డును సవరించుకుంది. గతేడాది బంగ్లాపై 7.1 ఓవర్లలోనే సెంచరీ చేయగా, నాలుగు బంతుల తేడాతో ఆ రికార్డు ఈ మ్యాచ్‌లో తెరమరుగైంది. ఇక, 35 బంతుల్లో 115 పరుగులను రెండో వికెట్ జోడించాక తిలక్ ఔటయ్యాడు. ఇక ఫిఫ్టీ తర్వాత జోరు పెంచిన అభిషేక్ ఎనిమిదో ఓవర్లో రషీద్ బౌలింగ్ రెండు భారీ సిక్సర్లు బాదాడు. ఆ తర్వాత ఓవర్లో లివింగ్ స్టన్ ఓవర్లో మరో రెండు కళ్లు చెదిరే సిక్సర్లు బాదాడు.

# అర్జిత్ సింగ్ పాటలంటే ఇష్టం

మహిళా క్రికెటర్ స్మృతీ మంధాన గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆమె యూత్ లో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న సంగతి తెలిసిందే. ఆమె తన ఆట తీరుతోనే గ్లామర్ తోనూ ఎంతో మంది ఫ్యాన్స్ ను సంపాదించుకుంది. అయితే తాజాగా ఆమె తనకు ఇష్టమైన సింగర్ ఎవరో తెలిపింది. డ్రెస్సింగ్ రూమ్‌లో తన ప్లే లిస్ట్‌లో ఉంటే టాప్ 3 పాటలు ఏంటో చెప్పింది. తాజాగా బీసీసీఐ ప్రతిష్టాత్మక నమన్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఈవెంట్ లో దేశీయంగా, అంతర్జాతీయంగా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన క్రికెటర్లను పురస్కారాలను అందించింది. ఈ సందర్భంగా కార్యక్రమంలో పురుష, మహిళా క్రికెటర్లు ప్రత్యేక చిట్ చాట్ సెషన్ లో పాల్గొని ఆసక్తికర విషయాలు తెలిపారు. తన ప్రశ్నలు, సమాధానాలతో ఈవెంట్ లో నవ్వులు పూయించారు. ఇందులో భాగంగానే డ్రెస్సింగ్ రూమ్‌లో ప్లే చేసేందుకు తన ప్లే లిస్ట్‌లో ఉండే టాప్ 3 పాటలు ఏంటి? అని మంధానను హార్దిక్ అడిగాడు. "నేను ఎక్కువగా లవ్ సాంగ్స్ , విషాద గీతాలు ఉంటాయి. కారణం తెలీదు కానీ అలాంటివే ఎక్కువగా ఇష్టం. మ్యాచ్‌కు ముందు అందరూ ఎక్కువగా పంజాబీ పాటలను ఇష్టపడుతుంటారు. కానీ నేను ఇలాంటివే వింటాను. అందరూ నా సాంగ్స్ విని షాకవుతారు. అందుకే మ్యాచ్‌కు ముందు నేను నా హెడ్‌ఫోన్‌లోనే సాంగ్స్ వింటూ ఆస్వాదిస్తాను " అని స్మృతి పేర్కొంది. ముఖ్యంగా అర్జిత్ సింగ్ పాటలంటే మరింత ఇష్టమని తెలిపింది. దీనికి సంబంధించిన వీడియోను ఇండియన్ క్రికెట్ టీమ్ సోషల్‌మీడియాలో షేర్ చేసింది.



# జోస్ బట్లర్ ను ఏకీపారేస్తోన్న ఫ్యాన్స్!!



ఇంగ్లాండ్ తో జరిగిన నాలుగో టీ20లో కంకషన్ సబ్‌స్టిట్యూట్ గా హర్షిత్ రాణా ఎంట్రీ ఇవ్వడం వివాః)దస్పదమైన సంగతి తెలిసిందే. దీనిపై మ్యాచ్ జరిగిన రోజే ఇంగ్లాండ్ జట్టు కెప్టెన్ జోస్ బట్లర్ కూడా అసంతృప్తి వ్యక్తం చేశాడు. తాజాగా ఐదో మ్యాచ్ లోనూ ఇదే విషయాన్ని టాస్ సమయంలో పరోక్షంగా లేవనెత్తి సెటైరికల్ కామెంట్స్ చేశాడు జోస్ బట్లర్. ప్రస్తుతం ఆ కామెంట్స్ వైరల్ గా మారాయి. టాస్ సమయంలో జట్టు కూర్పు గురించి మాట్లాడిన జోస్ బట్లర్ ఈ సెటైరికల్ కామెంట్స్ చేశాడు. సాధారణంగా సబ్‌స్టిట్యూట్‌లను తీసుకున్నప్పుడు సబ్‌స్టిట్యూట్‌ల వీరే అని చెబుతుంటారు. కానీ జోస్ బట్లర్ మాత్రం.. సకిబ్ మహమూద్ ప్లేస్ లో మార్క్ వుడ్‌ను తీసుకున్నట్లు చెబుతూనే.. 'ఇంపాక్ట్ సబ్స్' వీరేనంటూ మిగతా నలుగురి పేర్లను నొక్కి చెప్పాడు. దీంతో అతడు హర్షిత్ రాణా కంకషన్ సబ్‌స్టిట్యూట్ వివాదాన్ని మరోసారి లేవనెత్తేందుకు ప్రయత్నించినట్లు అర్థమవుతోందని క్రికెట్ ప్రియులు కామెంట్లు చేస్తున్నారు. 'నలుగురు కాదు 15 మంది వెంట తెచ్చుకున్నా నువ్వు చేసేదేమి లేదు', 'మళ్లీ ఏడవడం మొదలు పెట్టారురా' అని విమర్శిస్తున్నారు. పుణె వేదికగా జరిగిన నాలుగో టీ20 మ్యాచ్ లో శివమ్ దూబె కంకషన్ కు గురయ్యాడు. దీంతో కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా హర్షిత్ రాణా తీసుకున్నారు. ఈ మ్యాచ్ తోనే అతడు అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. వచ్చీ రాగానే అతడు చెలరేగి.. ఏకంగా మూడు వికెట్లు పడగొట్టాడు. తద్వారా టీమిండియా విజయంలో కీలకంగా వ్యవహరించాడు. ఈ క్రమంలోనే హర్షిత్ రాణా కంకషన్ సబ్‌స్టిట్యూట్ వివాదం చెలరేగింది. పలువురు మాజీ క్రికెటర్లు కూడా స్పందించేలా తీవ్ర చర్చకు కూడా దారితీసింది.

# ఛాంపియన్స్ ట్రోఫీలో రోహిత్ శర్మ, కోహ్లీ చెలరేగుతారు

## హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అభిప్రాయం

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ రాణిస్తారని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తెలిపాడు. దేశం తరపున పరుగులు చేసేందుకు ఈ ఇద్దరూ ఆకలితో ఉన్నారని చెప్పాడు. ప్రస్తుతం విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో కోహ్లీ, రోహిత్ దారుణంగా విఫలమైన విషయం తెలిసిందే. బీసీసీఐ ఆదేశాలతో దేశవాళీ క్రికెట్‌లో బరిలోకి దిగిన ఈ ఇద్దరూ తీవ్రంగా నిరాశపరిచారు. ఈ క్రమంలోనే వారి ఫామ్‌పై ఆందోళన నెలకొంది. అయితే ఛాంపియన్స్ ట్రోఫీలో భారత విజయంలో ఈ ఇద్దరూ కీలక పాత్ర పోషిస్తారని గంభీర్ ధీమా వ్యక్తం చేశాడు. శనివారం జరిగిన బీసీసీఐ నమన్ అవార్డ్స్ కార్యక్రమంలో పాల్గొన్న గౌతమ్ గంభీర్.. కోహ్లీ, రోహిత్ శర్మల గురించి ప్రత్యేకంగా మాట్లాడాడు. ఈ ఇద్దరూ జట్టుకు ఎంతో విలువను తీసుకొచ్చారని తెలిపాడు. 'ఛాంపియన్స్ ట్రోఫీలో కోహ్లీ, రోహిత్ కీలక పాత్ర పోషించబోతున్నారు. ఈ ఇద్దరూ దేశం తరపున సత్తా చాటాలనే ఆకలితో ఉన్నారు. దేశానికి ప్రాతినిథ్యం వహించడం వారికి ప్యాషన్. వన్డే ప్రపంచకప్‌తో పోల్చితే ఛాంపియన్స్ ట్రోఫీలో విభిన్నమైన సవాళ్లు ఉంటాయి. ప్రతీ మ్యాచ్ నాకౌట్ లాంటిదే.





# 'ఆకాశంలో ఒక తార' పూజా కార్యక్రమం ప్రారంభం

మల్టీటాలెంటెడ్, దక్షిణాది స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ సినిమా సినిమాకీ అభిమాన గణాన్ని పెంచుకుంటూ పోతోన్నారు. దుల్కర్‌కు ప్రస్తుతం తెలుగులో తిరుగులేని క్రేజ్ ఏర్పడింది. వరుసగా బ్లాక్ బస్టర్ హిట్ చిత్రాలతో తెలుగు ఆడియెన్స్‌ను మెప్పిస్తున్నారు. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ క్రేజీ డైరెక్టర్ పవన్ సాదినేనితో సినిమా చేస్తున్నారు. లైట్ బాక్స్ మీడియా బ్యానర్‌పై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'ఆకాశంలో ఒక తార' అనే టైటిల్‌ను పెట్టారు. ఇక ఈ ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ కోసం ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, అశ్వినీదత్, గుణ్ణం గంగరాజు కలిసి ముందుకు వచ్చారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా వంటి ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు ఈ చిత్ర నిర్మాణంలో భాగమయ్యాయి. 'ఆకాశంలో ఒక తార' ఆదివారం నాడు పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, అశ్విని దత్ వంటి వారు హాజరయ్యారు. ముహూర్తం షాట్‌కు అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా, అశ్విని దత్ కెమెరా స్విచాన్ చేశారు. ముహూర్తపు సన్నివేశానికి గుణ్ణం గంగరాజు దర్శకత్వం వహించారు. నటీనటులు, ఇతర సిబ్బందికి సంబంధించిన వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. టాలెంటెడ్ సుజిత్ సారంగ్ సినిమాటోగ్రఫర్‌గా, శ్వేత సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేయనున్నారు. 'ఆకాశంలో ఒక తార' తెలుగు, మలయాళం, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో భారీ ఎత్తున ప్లాన్ చేస్తున్నారు.

# రౌడీ హీరో 'సామ్రాజ్యం'

రౌడీ హీరో విజయ్ దేవరకొండ ఈసారి సాలిడ్ కంబ్యాక్ ఇవ్వబోతున్నాడు అని, వీడీ 12 సినిమా ప్రారంభమైనప్పటి నుంచి ఇండస్ట్రీ సర్కిల్స్‌లో చర్చలు జరుగుతున్నాయి. విజయ్‌తో గౌతమ్ తిన్ననూరి ఒక భారీ సినిమాను చేస్తున్నారని చిత్ర యూనిట్ తరఫున సమాచారం అందుతోంది. ముఖ్యంగా నిర్మాత నాగవంశీ గతంలో పలుమార్లు చెప్పారు, "వీడీ 12, నెక్స్ట్ లెవల్ సినిమాగా ఉంటుంది, బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టడం గ్యారెంటీ" అని. ఈ మాటలకు తగినట్టు, ఇప్పటి వరకు విడుదలైన విజయ్ లుక్స్ రౌడీ ఫ్యాన్స్‌లో మంచి అంచనాలు ఏర్పరచినట్లు తెలుస్తోంది...?

## యాంకర్, నటి అనసూయ భరద్వాజ్ గురించి కొత్తగా పరిచయం అవసరం లేదు. న్యూస్ రీడర్‌గా కెరీర్ ప్రారంభించిన ఈ భామ తరువాత యాంకర్‌గా మారింది. ఇక జబర్దస్త్ కామెడీ షోతో ఈ అమ్మడు కెరీర్ పూర్తిగా మారిపోయింది. ఈ షోతో ఎనలేని పాపులారిటీని సొంతం చేసుకుంది. దీంతో సిల్వర్ స్క్రీన్ పై అవకాశాలు అందుకుంది. అలా..ఎంతో మంది స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాన్ని కొట్టేసింది.



# అంటీలు, అబ్బాయిల రిలేషన్ పై బోల్డ్ కామెంట్స్

హీరోయిన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఇలా పలు విభిన్నపాత్రల్లో నటిస్తూ .. అటు బుల్లి తెర, ఇటు వెండి తెర ప్రేక్షకులను మెప్పిస్తుంది. తాజాగా అనసూయ చేసిన కామెంట్స్ నెట్టింట్లో వైరల్ గా మారాయి. ఇంతకీ ఏమైందంటే..? యాంకర్ అనసూయ ఏ విషయాన్ని అయినా కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడుతుంది. వేరే వాళ్లు ఏమనుకుంటున్నారని ఆలోచించకుండా.. బోల్డ్‌గా కామెంట్స్ చేస్తోంది. అందుకే ఆమె మీడియా కంట బడుతుంది. నెట్టింట్లో హాట్ టాపిక్ గా మారుతోంది. విజయ్ దేవరకొండ 'అర్జున్ రెడ్డి' లాంటి వివాదాల్లో కూడా తలదూర్చిందంటే.. అనసూయ ఏంత డేర్ అండ్ డ్యాషింగో అర్థం చేసుకోవచ్చు. అంతే కాదు.. సోషల్ మీడియాలో తన హాట్ హాట్ ఫొటోలను, బీచ్‌లో బికినీ ఫోటోలను, వీడియోలను కూడా షేర్ చేస్తూ.. సోషల్ మీడియాలో రచ్చ చేస్తోంది. తాజాగా అనసూయ కామెంట్స్ తో సోషల్ మీడియా మోత మోగుతుంది. ఇటీవల యాంకర్ అనసూయ ఓ స్పెషల్ ఇంటర్వ్యూలో పాల్గొంది. ఇందులో అక్రమ సంబంధాల గురించి పచ్చిగా మాట్లాడింది. అంటీలు, అబ్బాయిల రిలేషన్ పై బోల్డ్ కామెంట్స్ చేసింది. ఈ ఇంటర్వ్యూలో యాంకర్ మాట్లాడుతూ.. ' రీసెంట్‌గా ఒక సర్వే జరిగింది. ఈ జనరేషన్ అబ్బాయిలు.. దాదాపు 70 శాతం మంది.. తమకంటే ఎక్కువ వయసు ఉన్న మహిళలతో సెక్స్ వల్ గా ఉండాలని కోరుకుంటున్నారట. కానీ, ఆ అబ్బాయిల వయసు 20-25 మధ్యే ఉంది. వాళ్లు తమకంటే.. ఎక్కువ వయసు ఉన్న.. అంటే.. 30-35 ఏజ్ ఉన్నా లేడీస్ తో ఉండాలని అనుకుంటున్నారట' అని యాంకర్ చెబుతుండగా.. సడెన్ గా అనసూన రియాక్ట్ అవుతూ.. 'సెక్సువల్ గానా'అంటూ బోల్డ్‌గా అడిగేసింది. దీంతో ఆ యాంకర్.. ' అది సెక్సువల్ అని కాదు.. లస్ట్ ' అని అంటాడు. దీంతో అనసూయ రియాక్ట్ అవుతూ.. లస్ట్ అంటే అదే కదా' అంటూ ఓపెన్ అవుతుంది. 'వల్గర్ వేలో చెప్పకుండా.. అలా అన్నా 'అని ఆ యాంకర్ బదులిస్తాడు. ' ఇట్ నాట్ ఏ వల్గర్.. సెక్స్ అనేది అవసరం. దీని గురించి మాట్లాడానికి జనాలు ఎందుకు అలా ఫీల్ అవుతారో అర్థం కావడం లేదు. అలాగని బహిరంగంగా అది చేసుకోవాలి. బహిరంగంగా దాని మాట్లాడుకోవాలని కాదు. కాకపోతే అది అవసరం. అందులో తప్పేముంది. దాని గురించి మాట్లాడానికి సిగ్గుపడాల్సిన అవసరం లేదు' అంటూ బోల్డ్ గా బదులిచ్చింది అనసూయ. ప్రస్తుతం అనసూయ కామెంట్స్ వైరల్ గా మారాయి. 20- 25 ఏళ్లు బాయ్స్ కామంతో తనకంటే పెద్ద వాళ్లైన ఆడవాళ్లతో శృంగారం చేయడం తప్పు లేదనే కోణంలో మాట్లాడటం విమర్శలకు దారితీస్తుంది. వాస్తవానికి అనసూయ ఏ విషయాన్ని అయినా.. ఓపెన్ చెప్పేస్తుంది. ఎదుటి వారు ఎలా అనుకుంటారు అని ఫీల్ కాకుండా బోల్డ్ కామెంట్స్ చేస్తుంది. ఏదిఏమైనా అనసూయ తన కామెంట్స్ తో ట్రోల్స్ బారినపడింది.

# పాత్ర కోసం నాని ఇంటెన్స్ గా జిమ్ చేస్తున్నాడు

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ (SLV సినిమాస్) నిర్మాత సుధాకర్ చెరుకూరి 'దసరా' బ్లాక్ బస్టర్ విజయం తర్వాత 'ది ప్యారడైజ్' కోసం కొలాబరేట్ అయ్యారు. ఈ కొత్త చిత్రం త్వరలో ప్రారంభం కానుంది. ప్రీ-ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయి. నాని కూడా తన పాత్ర కోసం సిద్ధం కావడానికి ఇంటెన్స్ గా జిమ్ చేస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందించడం ఖాయమైయింది. జెర్సీ, గ్యాంగ్‌లీడర్ హిట్స్ తర్వాత నాని, అనిరుధ్ కలిసి పనిచేస్తున్న మూడవ చిత్రం ఇది. గత రెండు సినిమాలు మ్యూజికల్ హిట్స్ గా నిలిచాయి, అప్ కమింగ్ ప్రాజెక్ట్ కోసం అంచనాలు భారీగా వున్నాయి. శ్రీకాంత్ ఓడెలా పవర్ ఫుల్ లార్జర్ దెన్ లైఫ్ కథను ఇంటెన్స్ స్క్రీన్‌ప్లేతో రూపొందించారు, ఇది నానిని పూర్తిగా కొత్త, మాస్-డ్రైవ్ అవతార్‌లో ప్రజెంట్ చేయనుంది. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని గ్రాండ్ గా స్కేల్ లో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఇప్పటివరకు నాని యొక్క మోస్ట్ హై బడ్జెట్ వెంచర్.మిగిలిన నటీనటులు,సాంకేతిక నిపుణుల వివరాలు మేకర్స్ త్వరలోనే తెలియజేస్తారు.





# అందరినీ ఎంటర్ టైన్ చేయాలనే పాషన్ తో వస్తున్నాం

ఐదోసారి CCL టైటిల్ కొడతామనే నమ్మకం వుంది

జెర్సీ లాంచ్ ఈవెంట్ లో తెలుగు వారియర్స్ కెప్టెన్ అఖిల్ అక్కినేని

**CCL 11వ సీజన్ & తెలుగు వారియర్స్ థ్రిల్లింగ్ గేమ్ షెడ్యూల్‌ను ప్రకటించింది. సెలబ్రిటీ క్రికెట్ లీగ్ (CCL) ఫిబ్రవరి 8న బెంగళూరులో 11వ సీజన్‌ను ప్రారంభం కానుంది, ఇది మైదానంలో మరపురాని క్షణాలను అందిస్తోంది. ఈ సీజన్‌లో నాలుగుసార్లు ఛాంపియన్‌లుగా తమ లెగసీ కంటిన్యూ ని చేయడానికి వారి ప్రతిష్టాత్మకమైన 5వ టైటిల్ గెలుపు కోసం సిద్ధమవుతున్న బలమైన జట్టు తెలుగు వారియర్స్ పై అందరి దృష్టి ఉంది. ఈ సందర్భంగా తెలుగు వారియర్స్ జెర్సీ లాంచ్ ప్రెస్ మీట్ నిర్వహించింది.**

తెలుగు వారియర్స్ కెప్టెన్ అఖిల్ అక్కినేని మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సిసిఎల్ 14 ఏళ్ల జర్నీ. గ్లింప్స్ లో చూస్తే ఓ చోట మరీ చిన్నపిల్లాడిలా కనిపించాను. సిసిఎల్ ఆడుతూ పెరిగాను. విష్ణు, సచిన్ పాషన్ తో ఇది సాధ్యపడిందని భావిస్తున్నాను. మేము నాలుగు సార్లు టైటిల్ గెలిచాం. ఈసారి కూడా టైటిల్ కొట్టి ఐదు సార్లు ఛాంపియన్ గా నిలుస్తామనే నమ్మకం వుంది. అన్నిటికంటే అందరినీ ఎంటర్ టైన్ చేయాలనే పాషన్ తో వస్తున్నాం. 14, 15 ఉప్పల్ స్టేడియంలో ఆడుతున్నాం. అందరూ వచ్చి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాము' అన్నారు

ఎస్ఎస్ తమన్ మాట్లాడుతూ.. క్రికెట్ అనేది నా చైల్డ్ వుడ్ డ్రీం. సిసిఎల్ ఫార్మెట్ నా డ్రీం ని తీర్చింది. దేశంలోని ప్రముఖ మైదానాల్లో క్రికెట్ ఆడటం ఓ అదృష్టం. అఖిల్ అగ్రెసివ్ కెప్టెన్. తన ఎత్తుగడలు అద్భుతంగా వుంటాయి. తనలో చాలా ఫైర్ వుంది. క్రికెట్ మాకు చాలా ఎనర్జీ ఇస్తోంది. మాది చాలా క్రేజీ టీం. సచిన్ టీంకి ఓనర్ తో పాటు ఆటగాడిగా బిగ్గెస్ట్ స్ట్రెంత్. మూడు నెలలుగా చాలా ప్రాక్టీస్ చేశాం. ఈసారి తప్పకుండా కప్ కొడతాం. విష్ణు చాలా పాషన్ తో సీజన్స్ ని ముందుకు తీసుకుతీసుకెళ్తున్నారు. అందరికీ థాంక్ యూ సో మచ్' అన్నారు.

సచిన్ జోషి మాట్లాడుతూ.. ఇండియాలో అందరి డ్రీం క్రికెట్. ఆ డ్రీం మాకు సిసిఎల్ రూపంలో తీరింది. ఈ క్రెడిట్ విష్ణుకి ఇస్తాను. తన ఆలోచన గొప్ప విజయం సాధించింది. వెంకటేష్ గారికి థాంక్ యూ. ఆయన సపోర్ట్ ని మర్చిపోలేను. మా టీం అంతా నా ఫ్యామిలీ. అన్ని సమయంలో చాలా సపోర్ట్ చేశారు. అఖిల్ పాషనేట్ క్రికెటర్. వండర్ ఫుల్ పర్సన్. తమన్ టీంలో స్పిరిట్ ని తీసుకొస్తుంటారు. మా స్పాన్సర్స్ అందరికీ థాంక్ యూ' అన్నారు.

అశ్విన్ మాట్లాడుతూ.. విష్ణు అన్న చాలా సక్సెస్ ఫుల్ గా సీజన్ రన్ చేస్తున్నారు. మేమంతా చాలా పాషన్ తో ఆడుతున్నాం. ఐదోసారి కప్ తీసుకొస్తామని మా టీం అందరి తరపున చెబుతున్నాను. మీ అందరి సపోర్ట్ కావాలి'అన్నారు.

రఘు మాట్లాడుతూ.. సిసిఎల్ ని ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో నిర్వహిస్తున్న విష్ణు గారి థాంక్ యూ. నాలుగు స్టార్లు కప్పుకొట్టాం. ఈసారి మళ్ళీ కప్పు కొడతాం.' అన్నారు

ఆది మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. తెలుగు వారియర్స్ కెప్టన్ అఖిల్ మాకు విరాట్ కోహ్లి లాంటి ప్లేయర్, చాలా పాషన్ తో ఆడుతున్నాం. నాలుగు సార్లు కప్ కొట్టాం. ఈసారి మళ్ళీ ఛాంపియన్ అవుతాం' అన్నారు.

సామ్రాట్ మాట్లాడుతూ,.. సీజన్ వన్ నుంచి వున్నాను. ఈ జర్నీలో అప్స్ అండ్ డౌన్స్ అన్నీ చూశాను. విష్ణు గారు చాలా పాషన్ తో టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. అఖిల్ ఇంటెలెంట్ కెప్టన్. తమన్ అన్న మై పార్ట్నర్. ఈ సీజన్ కప్ మాదే' అన్నారు.

CCL వ్యవస్థాపకుడు విష్ణు వర్దన్ ఇందూరి మాట్లాడుతూ.. CCL 11వ సీజన్‌కు చేరుకోవడం మాకు గర్వకారణం. ఈ టోర్నమెంట్ ప్రత్యేకమైనది, భారతదేశంలోని చలనచిత్ర పరిశ్రమల నుండి నటీనటులను ఒకే వేదికపైకి తీసుకువస్తుంది. పాల్గొనే జట్ల నైపుణ్యం, స్ఫూర్తి , దృఢ సంకల్పాన్ని చూసి మేము సంతోషిస్తున్నాము తెలుగు వారియర్స్ ఎల్లప్పుడూ టోర్నమెంట్‌కు అదనపు ఉత్సాహాన్ని తెస్తుంది.' అన్నారు.

Rika Valley Chairman షోరబ్ అర్వాత్ మాట్లాడుతూ.. విష్ణు గారికి సచిన్ గారికి థాంక్ యూ. అఖిల్ గారు గ్రేట్ ఫైటర్ ఇన్ క్రికెట్. ఈ అవకాశం ఇచ్చిన అందరికీ థాంక్ యూ' అన్నారు.

సీజన్ & గేమ్ షెడ్యూల్

★ ఫిబ్రవరి 8, బెంగళూరు:
తెలుగు వారియర్స్ vs. కర్ణాటక బుల్డోజర్స్
★ ఫిబ్రవరి 14, హైదరాబాద్ (రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం, ఉప్పల్):
తెలుగు వారియర్స్ vs. భోజ్‌పురి దబ్బాంగ్స్
★ ఫిబ్రవరి 15, హైదరాబాద్ (రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం, ఉప్పల్):
తెలుగు వారియర్స్ vs. చెన్నై రైనోస్
★ ఫిబ్రవరి 23, సూరత్:
తెలుగు వారియర్స్ vs. బెంగాల్ టైగర్స్
సోనీ స్పోర్ట్స్ టెన్ 3 ఛానల్, హాట్‌స్టార్ OTTలో ప్రత్యక్ష ప్రసారం



# విలేకరిపై పూజాహెగ్డే ఆగ్రహం

పూజా హెగ్డే కథానాయికగా నటించిన బాలీవుడ్ చిత్రం 'దేవా'. ఇటీవల విడుదలైన ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా పూజాహెగ్డే, నటుడు షాహిద్ కపూర్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు.అగ్ర హీరోల చిత్రాల్లో నటించడంపై పూజాహెగ్డేకు విలేకరి కొన్ని ప్రశ్నలు ఎదురుకాగా, ఆమె కాస్త ఆగ్రహం వ్యక్తం చేసారు. బాలీవుడ్ అగ్ర హీరోలైన సల్మాన్ ఖాన్, హృతిక్ రోషన్, రణ్‌వీర్ సింగ్, షాహిద్ కపూర్ వంటి స్టార్ హీరోల చిత్రాల్లో నటించడం అదృష్టం అని మీరు భావిస్తారా? ఈ చిత్రాలకు మీరు అర్హులేనని అనుకుంటున్నారా? అని విలేకరి అడిగాడు. పూజాహెగ్డే స్పందిస్తూ ఆయా చిత్రాలకు నేను అర్హురాలినే. నిర్మాతలు, దర్శకులు నన్ను ఎంపిక చేసినందుకు వారి వద్ద కొన్ని కారణాలు ఉంటాయి. నేను ఎప్పుడూ పాత్రకు పూర్తిగా న్యాయం చేయడానికి సన్నద్ధమై ఉంటాను. అదృష్టం అనేది జీవితంలో నాకు వచ్చిన ఒక భాగమని భావిస్తా.మీరు అదృష్టం వల్ల ఈ అవకాశాలు వచ్చాయని అనుకుంటే, నేను బాధపడను. మీరు అలా అనుకుంటే, అలా అనుకోండి అని అసహనం వ్యక్తం చేశారు.తర్వాత మీరు సినిమాలు ఎలా ఎంచుకుంటారు? స్టార్ హీరోల చిత్రాలే చేస్తారా?" అని ప్రశ్నించగా, పూజాహెగ్డే మరోసారి ఆగ్రహానికి గురయ్యారు. 'మీ సమస్య ఏమిటి'? అని ప్రశ్నించారు. అప్పుడు షాహిద్ కపూర్ సరదాగా స్పందించారు. నువ్వు యాక్ట్ చేసిన స్టార్ హీరోలంటే అతడికి ఇష్టం అనుకుంటా. అందుకే నీ నుంచి సలహాలు తీసుకుంటున్నట్లుగా ఉందని జోకులు వేశారు.



# దర్శకుడితో సమంత చెట్టాపట్టాల్

సమంత ఒంటరిగా ఉంటుందా? లేదంటే అతని జీవితంలో ఎవరైనా ఉన్నారా? యువ సామ్రాట్ అక్కినేని నాగ చైతన్యతో విడాకులు తీసుకున్న తర్వాత మళ్లీ ప్రేమలో పడిందా? ఇప్పుడు సమంత రిలేషన్షిప్ స్టేటస్ ఏమిటి? ఈ ప్రశ్నలు ప్రేక్షకులు చాలా మందిలో ఉన్నాయి. విడాకుల తర్వాత తన వ్యక్తిగత జీవితం గురించి సమంత ఎప్పుడూ చెప్పింది లేదు. ఆ విషయంలో మౌనం వహించింది. సోషల్ మీడియాలో తాజాగా షేర్ చేసిన ఫోటోలు చూస్తే... డేటింగ్ న్యూస్ నిజమే అని కన్ఫర్మేషన్ ఇచ్చినట్టు ఉంది. నాగ చైతన్య సమంత విడాకులు తీసుకోవడానికి కారణం ఏమిటి? అనేది ఎవరికీ తెలియదు. అయితే విడాకుల తర్వాత ఆ అంశం గురించి చైతన్య పెద్దగా మాట్లాడలేదు. కానీ, సమంత పరోక్షంగా చైతూ కారణం అన్నట్లు సోషల్ మీడియా పోస్టులు చేస్తుంది. ఆవిడను అక్కినేని అభిమానులు విమర్శిస్తూ ఉంటారు. సమంత వ్యవహార శైలి విడాకులకు కారణం అని ఆరోపించిన వ్యక్తులు కూడా ఉన్నారు. అయితే... 'ఫ్యామిలీ మ్యాన్ 2' వెబ్ సిరీస్ దర్శకులలో ఒకరైన రాజ్ నిడమోరుతో సమంత డేటింగ్ చేస్తోందని చాలా రోజులుగా వినబడుతోంది. విడాకుల సమయంలో సమంత 'ఫ్యామిలీ మ్యాన్' వెబ్ సిరీస్ చేయడం, అందులో క్యారెక్టర్ బోల్డుగా ఉండడం డిస్కషన్ పాయింట్ అయింది. కొన్నాళ్లకు ఆ వెబ్ సిరీస్ దర్శకులలో ఒకరైన రాజ్ నిడమూరు సమంత డేటింగులో ఉన్నారని రూమర్లు వినిపించాయి. ఆ పుకార్లలో ఎంతవరకు నిజం ఉందో తెలియదు గానీ ఇప్పుడు మరోసారి తెరపైకి వచ్చాయి అది కూడా సమంత చేసిన ఒక పని వల్ల. 'ఫ్యామిలీ మ్యాన్ 2' వెబ్ సిరీస్ తర్వాత రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించిన 'సిటాడెల్: హనీ బన్నీ'లోనూ సమంత నటించారు. ఇప్పుడు అదే దర్శక ద్వయం తీస్తున్న 'రక్త్ బ్రహ్మాండ్'లో కూడా సమంత ఉన్నారు. వెబ్ సిరీస్ షూటింగ్ లోకేషన్ లేదా ప్రమోషనల్ కార్యక్రమాలలో రాజ్ నిడమోరుతో కలిసి సమంత కనిపిస్తే ప్రేక్షకులు ఎవరికీ పెద్దగా సందేహాలు వచ్చేవి కాదు. కానీ పిక్ బాల్ టోర్నమెంట్ దగ్గర సమంత, రాజ్ నిడమోరు చేతిలో చెయ్యేసుకుని, చెట్టపట్టాలేసుకుని తిరగడం పుకార్లకు మళ్ళీ ఊతం ఇచ్చినట్టు అయింది. పిక్ బాల్ టోర్నమెంట్ కోర్టులో రాజ్ నిడమోరు, సమంత కలిసి నడుస్తూ కనిపించారు. అంతే కాదు... గ్రూప్ ఫోటో దిగిన సమయంలో ఒకరి చేతిలో మరొకరి చేయ ఉంది. దాంతో వాళ్ళిద్దరూ డేటింగ్ చేస్తున్నట్లు ఇలా కన్ఫర్మ్ చేశారని ఫిలిం నగర్ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నారు. పిక్ బాల్ టోర్నమెంట్ విషయానికి వస్తే చెన్నై సూపర్ ఛాన్స్ టీం యాజమాన్యంలో సమంత కూడా ఉంది. ఆవిడకు మద్దతుగా రాజ్ వచ్చారు, అది సంగతి.


Editor, Printed, Published and Owned by Sudheer Kumar, Printed at Ratna Graphics , # 2-3-703/7, Thirumala Nagar Colony, Opposite : Police Line , Amberpet, Hyderabad-500013, Published At H.NO. 6-3-553/G2, ClassicCourt Anexa, opp: NKM Grand, Erramanzil Colony, Somajiguda, Hyderabad-500038, T.S. E-Mail: info.southindiatimes@gmail.com. ,Contact :9000657700. RNI NO. APTEL/2012/46756